Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 347 మేడ్చల్ మల్కాజ్‌గిరి 5 జనవరి 2024 శుక్రవారం పేజీలు : 4

## దట్టంగా కమ్ముకున్న పొగమంచు.. విమానాల ఆలస్యం, స్కూల్స్ బంద్

ఉత్తర భారతదేశంలోని అనేక రాష్ట్రాల్లో గురువారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకుంది. ఉదయం 6 దాటినా కూడా రహదారులు కనిపించకపోవడంతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, చండీగఢ్, రాజస్థాన్, బీహార్, మధ్యప్రదేశ్, త్రిపుర, జమ్మూలలో చాలా దట్టం గా పొగమంచు నెలకొంది. ఈ నేపథ్యంలో పొగమంచు కారణంగా ఢిల్లీలో పలు విమానాలు ఆలస్యంగా ప్రయాణించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో తీవ్రమైన శీతల వాతావరణ పరిస్థితుల కారణంగా ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా, గ్రేటర్ నోయిడా జిల్లాలో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. జనవరి 6వ తేదీ వరకు మొదటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు పాఠశాలలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు.

# 'పార్లమెంట్' సందడి

## 21 వరకు పార్టీ సమావేశాలు..వీరికి ఛాన్స్ దక్కేనా?




హైదరాబాద్ : మరికొన్ని నెలల్లోనే లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ అనేక స్థానాల్లో గెలిచేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని స్థానాలకు పరిమిత పార్టీ ఎలాగైనా ఎంపీ స్థానాల్లో మెజారీ సాధించాలని చూస్తోంది. ఈ క్రమంలోనే వ్యూహాలు, ప్రజా సంబంధాల ప్రచారాలకు సంబంధించి పార్టీ కీలకమైన సమావేశాలను ప్రారంభించింది. రెండు దశల్లో ఈ సమావేశాలు జరగనున్నాయి. నిన్నటి నుండి సమావేశాలు ప్రారంభం కాగా జనవరి 12 వరకు మొదటి దశ, సంక్రాంతికి మూడు రోజుల విరామం తర్వాత జనవరి 16 నుంచి జనవరి 21 వరకు రెండో దశ. అయితే మొదటి రోజైన బుధవారం ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పార్టీ నేతలతో భేటీ జరిగింది. అయితే ఈ భేటీలో పలువురికి కీలక స్థానాలను అప్పగించినట్లు తెలుస్తోంది.

ఇందులో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల వ్యూహంపై మేధోమథనం చేశారు. ఈ భేటీలో రాబోయే ఎన్నికల ప్రచార అంశాలపై చర్చించారు. ఈ సమావేశాలకు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు, ప్రధాన కార్యదర్శి కె కేశవరావు, అసెంబ్లీ మాజీ స్పీకర్‌లు ఎస్ మధుసూదన్ చారి, టి హరీష్‌రావు, కడియం శ్రీధర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జి జగదీష్‌రెడ్డి సహా ప్రముఖులు హాజరయ్యారు. తెలంగాణ భవన్‌లో జరిగే ఈ సన్నాహక సమావేశాల్లో వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎస్ నిరంజన్‌రెడ్డి కీలకపాత్ర పోషించనున్నారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలోని ప్రముఖ నేతలందరినీ సమావేశాలకు ఆహ్వానిస్తారు. బీఆర్‌ఎస్ లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు, మేయర్లు, మాజీ మేయర్లు, మున్సిపల్ అధ్యక్షులు, మున్సిపల్ మాజీ అధ్యక్షులు, మాజీ కార్పొరేషన్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా పార్టీ సమావేశాలు ఆయా నియోజకవర్గాలు, ఆయా లోక్‌సభ నియోజకవర్గాల స్పీకర్‌లు, ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్య నేతలను చేర్చుకుంటారు. దీంతో పాటు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ స్వల్ప తేడాతో ఓడిపోయిన ప్రాంతాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తారు.




## లక్షదీవుల్లో మోదీ 'స్నార్కెలింగ్' సాహసం..

దిల్లీ: లక్షద్వీప్‌లో ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రకృతి అందాలను ఆయన ఆస్వాదించారు. సముద్రం ఒడ్డున కూర్చుని కొంతసేపు సేద తీరారు. అంతేకాదు.. సముద్రంలో స్నార్కెలింగ్ (సాహసంతో కూడిన స్విమ్మింగ్) కూడా చేశారు. సముద్ర గర్భంలోని పగడపు దిబ్బలు, జీవరాశులను ప్రత్యక్షంగా వీక్షించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ప్రధాని తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. "లక్షదీవుల సౌందర్యం, అక్కడి ప్రజల మమకారం చూసి నేనింకా సంభ్రమాశ్చర్యంలోనే ఉన్నా. ప్రకృతి అందాలు, ప్రశాంతమైన వాతావరణంతో ఈ దీవులు మనల్ని మంత్రముగ్ధులను చేస్తున్నాయి. 140కోట్ల మంది భారతీయుల సంక్షేమం కోసం నేను మరింత కష్టపడి ఎలా పనిచేయాలో ఈ వాతావరణం నాకు నేర్పింది. సాహసాలు చేయాలనుకునేవారు.. మీ లిస్ట్‌లో లక్షద్వీప్‌ను కూడా చేర్చుకోండి" అని మోదీ రాసుకొచ్చారు. లక్షద్వీప్‌లో తాను స్నార్కెలింగ్ కూడా ప్రయత్నించినట్లు మోదీ తెలుపుతూ ఆ చిత్రాలను కూడా షేర్ చేశారు. పగడపు దీపులు, చేపల ఫొటోలను పంచుకున్నారు. 'ఇది ఎంతో అద్భుతమైన అనుభవం' అని పేర్కొన్నారు. స్నార్కెలింగ్ అనేది సముద్రంలో చేసే ఓ తరహా డైవింగ్ లాంటిది. స్నార్కెల్ అనే ట్యూబ్, డైవింగ్ మాస్క్‌ను ముఖానికి ధరించి సముద్రం లోపల ఈత కొడుతారు. ఈ స్నార్కెలింగ్‌తో సముద్ర గర్భంలో పర్యావరణాన్ని, జీవరాశులను అన్వేషించొచ్చు.




## తెలంగాణలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. దీంతో వారిద్దరూ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. ఈ రెండు స్థానాలకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్‌ను గురువారం కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది.

**జనవరి 11న నోటిఫికేషన్**
**నామినేషన్ల దాఖలుకు చివరితేదీ జనవరి 18**
**నామినేషన్ల పరిశీలన జనవరి 19**
**నామినేషన్ల ఉపసంహరణకు చివరితేదీ జనవరి 22**
**ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్, కౌంటింగ్ జనవరి 29**




## 'ధరణి'లో మార్పులకు శ్రీకారం

### 'భూ మాత'గా మార్చేందుకు సన్నాహాలు

### 2 రోజులుగా భూముల రిజిస్ట్రేషన్లు బంద్ - ప్రస్తుతం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లకే అనుమతి

రంగారెడ్డి జిల్లా : రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం.. కీలకమైన రెవెన్యూ వ్యవహారాలపై దృష్టి సారించింది. ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగానే ధరణి పోర్టల్‌లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ధరణి పోర్టల్‌ను 'భూమాత'గా మార్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగానే రెండు రోజుల పాటు భూముల రిజిస్ట్రేషన్లను సైతం నిలిపివేసింది. ముందస్తు సమాచారం లేకుండా భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో స్లాట్లు బుక్ చేసుకున్న వారు తీవ్ర ఇబ్బంబదులు పడ్డారు. అయితే, మధ్యాహ్నం నుంచి భూముల రిజిస్ట్రేషన్లు మళ్లీ ప్రారంభమయ్యాయి. రిజిస్ట్రేషన్ల కోసం మీసేవలో స్లాట్ల బుకింగ్ కూడా మళ్లీ ప్రారంభమైంది. అయితే, ధరణిలో భూసమస్యల పరిష్కార ప్రక్రియను మాత్రం పూర్తిగా నిలిపివేశారు. కేవలం.. ఆయా సమస్యలపై మీ సేవల ద్వారా బాధితులు దరఖాస్తు చేసుకునేందుకు మధ్యాహ్నం నుంచీ అవకాశం కల్పించారు. రికార్డుల కంప్యూటరీకరణ సమయంలో జరిగిన పొరపాట్ల కారణంగా భూ విస్తీర్ణంలో తేడాలు, పేరు తప్పుగా ఉండడం, ఒకరి భూమి మరొకరి పేరుపై ఉండడం, డిజిటల్ సంతకం లేకపోవడం... వంటి సమస్యలతో బాధితులు సతమతమవుతున్నారు. వీటిపై క్షేత్రస్థాయి నుంచి సమాచారం తెప్పించి పరిష్కరించే వీలున్నా.. గతంలో అలాంటి ప్రయత్నమే జరగలేదు.

# రాహుల్ మళ్ళి మొదలు పెడుతున్నాడు!

# 15 రాష్ట్రాలు, 6700 కి.మీ..

## మరో యాత్రకు రాహుల్ గాంధీ శ్రీకారం




న్యూఢిల్లీ: లోక్ సభ ఎన్నికలకు సమయం సమీపిస్తోన్న వేళ ప్రధాన పార్టీలు ప్రచారంపై దృష్టిసారించాయి. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మరో యాత్రతో ప్రజల ముందుకు వస్తున్నారు. ఇప్పటికే భారత్ జోడో యాత్ర చేపట్టగా.. ఆ పార్టీకి బూస్టింగ్ ఇచ్చింది.

ఆ యాత్ర వల్ల కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇదివరకు దక్షిణ భారతదేశం నుంచి ఉత్తర భారతదేశానికి భారత్ జోడో యాత్ర చేపట్టగా.. ఇప్పుడు తూర్పు నుంచి పడమరకు భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపట్టనున్నారు. ఈ నెల 14వ తేదీన రాహుల్ గాంధీ యాత్ర ప్రారంభం అవుతుంది. 15 రాష్ట్రాల గుండా, 67 రోజుల పాటు యాత్ర కొనసాగుతోంది. 6700 కిలోమీటర్ల మేర రాహుల్ గాంధీ పర్యటిస్తారు.

**జోడో ఎందుకంటే..? :** గత ఏడాది కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4 వేల కిలోమీటర్ల మేర భారత్ జోడో యాత్రను రాహుల్ గాంధీ చేపట్టారు. 136 రోజుల పాటు ఆ యాత్ర కొనసాగింది. ఇప్పుడు భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపడుతున్నారు. యాత్ర పేరు ముందు భారత్ న్యాయ్ యాత్ర అని ఉండేది. తర్వాత దానికి జోడో చేర్చారు. మొదటి యాత్రకు జోడో చేపట్టడంతో సెంటిమెంట్ వర్కవుట్ అయ్యింది. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. ఇప్పుడు దానినే ఫాలో అవుతున్నారు. అలాగే ముందు 14 రాష్ట్రాల్లో యాత్రను షెడ్యూల్ చేశారు. ఇప్పుడు మరో రాష్ట్రాన్ని చేర్చారు. దీంతో పర్యటించే కిలోమీటర్లు కూడా 6200 నుంచి 6700కు పెరిగాయి.

**ఇండియా కూటమి పార్టీలు పాల్గొంటాయా..? :** భారత్ న్యాయ్ జోడో యాత్ర 110 జిల్లాల గుండా 100 లోక్ సభ నియోజకవర్గాలతో సాగనుంది. ఇందులో 337 అసెంబ్లీ నియోజకవర్గాలు కూడా కలుస్తాయి. రాహుల్ గాంధీ చేపట్టే యాత్రలో పాల్గొనాలని ఇండియా కూటమి పార్టీలను కోరామని కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. చిన్న పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు కూడా పాల్గొనాలని కోరామని తెలిపింది. భారత్ జోడో యాత్రలో ఆర్థిక అసమానతలు, నియంతృత్వం గురించి రాహుల్ గాంధీ ప్రధానంగా ప్రస్తావించారు. ఇప్పుడు చేపట్టే యాత్రలో సామాజిక, ఆర్థిక అంశాలు గురించి లేవనెత్తుతారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తెలిపారు.

## సంపాదకీయం

# అయోధ్య రామాలయంపై ఈ రెచ్చగొట్టుడేంది అసద్?

మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం పూర్తి అవుతున్న వేళ.. ఆయన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. మసీదుల్లో ముస్లిం యువత ఉండేలా చూడాలని పిలుపునిచ్చారు. మరిన్ని మసీదుల్ని తమ నుంచి తీసేసుకునే అవకాశం ఉందంటూ ముస్లిం సమాజాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుండటం గమనార్హం. తన ప్రసంగంలో భాగంగా అయోధ్య రామమందిర ప్రస్తావనను తీసుకొచ్చిన ఆయన తీరుపై మండిపాటు వ్యక్తమవుతోంది. "గత 500ఏళ్లుగా ఖురాన్ పఠనం జరిగిన ప్రాంతం మనది కాకుండా పోయింది. మూడు.. నాలుగు మసీదుల విషయంలో జరుగుతున్న కుట్ర మీకు కనిపించట్లేదా? ఢిల్లీలోని సునెహ్రీ మసీదు కూడా ఆ జాబితాలో ఉంది. చాలా ఏళ్ల పాటు కష్టపడి మనం ఈ స్థాయికి చేరుకున్నాం. ఇలాంటి విషయాల మీద మీరు ఫోకస్ చేయాలి. ముస్లింలు అందరూ ఐకమత్యంతో ఉండాలి" అంటూ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ భవానినగర్ లో జరిగిన కార్యక్రమంలో అసదుద్దీన్ ఓవైసీ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముస్లిం యువత తన బలాన్ని కాపాడుకోవాలన్న ఆయన.. మసీదుల్లో జనాల్ని ఎప్పుడూ ఉంచేలా చూసుకోవాలన్నారు. 'రేపటి వృద్ధుడు కాబోతున్న నేటి యువకుడు తన కళ్లను ముందు ఉంచుకొని.. తన కుటుంబానికి.. తన నగరానికి.. తన పొరుగువారికి ఎలా సాయం చేయాలో గట్టిగా ఆలోచిస్తారని నేను ఆశిస్తున్నా. ఐక్యత ఒక బలం. ఐక్యత ఒక ఆశీర్వాదం" అని పేర్కొన్నారు. తన ప్రసంగం అసాంతం ముస్లింలను రెచ్చగొట్టేలా.. వారిని భావోద్వేగానికి గురయ్యేలా వ్యాఖ్యలు చేయటం గమనార్హం. "అందరం చనిపోతాం. కానీ చనిపోయిన తర్వాత అల్లాకు ఏ విధంగా మీ ముఖం చూపిస్తారు?" అంటూ రెచ్చగొట్టేలా చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా.. అసుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యలపై విశ్వహిందూ పరిషత్ వార్నింగ్ ఇచ్చింది. ముస్లింలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. వీహెచ్ పీ అంతర్జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి సురేంద్ర జైన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. అసద్ లాంటి నేతలు ముస్లిం వర్గాల ప్రజలను పదే పదే రెచ్చగొట్టొద్దన్నారు. అభివృద్ధికి దారి తీయని చీకటి గల్లీలోకి ముస్లిం సమాజాన్ని నెట్టేస్తున్నారన్న ఆయన.. అసదుద్దీన్ వ్యాఖ్యలు చట్టపరమైన.. రాజ్యాంగ పరిధి దాటాయా? లేదా? అన్న అంశాన్ని పరిశీలిచాని తమ లీగల్ సెల్ టీంకు చెప్పామన్నారు. "ముస్లిం సమాజంలో ఒక పెద్ద వర్గం ఈ గొప్ప ఆలయానికి స్వాగతం పలికేందుకు సిద్ధమవుతుండటాన్ని చూసి వారు మరింత నిరుత్సాహానికి గురవుతున్నారు. అందుకే ముస్లిం సమాజంలోని ఒక వర్గాన్ని హిందువులకు వ్యతిరేకంగా.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నారు" అని వ్యాఖ్యానించారు. అసద్ వ్యాఖ్యలపై ఢిల్లీ పోలీసులకు హిందూసేన ఫిర్యాదు చేసింది. మొత్తంగా చూస్తే.. అయోధ్యలోని వివాదాస్పద కట్టడంపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో సుదీర్ఘ విచారణ జరిగి.. దీనిపై తీర్పు వచ్చిన అనంతరం నిర్మితమవుతున్న ఆలయంపై అసదుద్దీన్ ఈ తరహా వ్యాఖ్యలు చేయటం సరికాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బాధ్యత కలిగిన లోక్ సభ సభ్యుడిగా ఆయన తీరును తప్పుపడుతున్నారు. రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన అసద్ పై చట్టం తన పని తాను చేసుకుంటూ పోవాలన్న అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది.

# నిఘా కొరవడి.. కోతలకు ఎగబడి



ఆదిలాబాద్ : శస్త్ర చికిత్స కాన్పుల వల్ల ఎన్నో దుష్పరిణామాలను మహిళలు ఎదుర్కోవాలి వస్తోందని భావించిన ప్రభుత్వం సాధారణ కాన్పులకే ప్రాధాన్యమివ్వాలని, సహజ ప్రసవాల సంఖ్య పెంచాలని సూచిస్తోంది. ఈ విషయమై ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు జిల్లా పాలనాధికారులు, డీఎంహెచ్‌ఓలతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు చేయాలని సూచిస్తున్నారు. ప్రతి వారం ఈ విషయమై హైదరాబాద్ స్థాయి నుంచి సమీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఈ సూచనలు కేవలం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే అమలవుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు మాత్రం పట్టించుకోవటం లేదు. 2021-22లో జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 72.10 శాతం సాధారణ ప్రసవాలు చేయగా ప్రైవేటులో 14.87 శాతం మాత్రమే చేశారు. 2022-23లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 72.73 శాతం సహజ కాన్పులు కాగా ప్రైవేటులో 14.58 శాతం మాత్రమే చేశారు.

**మూలన పడ్డ ఈ-బర్త్ విధానం**

ప్రభుత్వం రెండేళ్ల కిందట 'ఈ-బర్త్' విధానం రూపొందించింది. ప్రతి ఆసుపత్రికి ప్రత్యేక లాగిన్ ఇచ్చారు. ఈ విధానంలో ప్రభుత్వ/ప్రైవేటు ఆసుపత్రుల్లో గర్భిణులకు చేసే స్కానింగ్ పరీక్షల వివరాలన్నీ నమోదు చేయాల్సి ఉండేది. ఈ నివేదికల ఆధారంగా సదరు గర్భిణికి సాధారణ ప్రసవం చేయవచ్చా? శస్త్ర చికిత్స కాన్పు చేయాల్సి వస్తుందా? అనేది నిర్ధారణ చేసే వారు. కొన్ని సందర్భాల్లో ఆబార్షన్ చేయాల్సిన పరిస్థితి తలెత్తితే ఈ విధానం ద్వారా వివరాలు తెలిసేవి. ఈ ప్రక్రియను హైదరాబాద్ స్థాయి నుంచి ఆన్‌లైన్‌లో పర్యవేక్షించేవారు. కేవలం కొన్నాళ్లు మాత్రమే సాగిన ఈ విధానం ఆ తరువాత కుంటుపడింది. ప్రైవేటు ఆసుపత్రులపై నిఘా పూర్తిగా కొరవడింది. జిల్లా స్థాయి వైద్యాధికారులు దీనిపై పర్యవేక్షణను విస్మరించారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇష్టారాజ్యంగా కోతల ప్రసవాలు కానిస్తున్నారు. అత్యవసరమైతేనే శస్త్ర చికిత్స కాన్పులు చేస్తున్నామని వాదించే ప్రైవేటు వైద్యులు సమస్యాత్మక కాన్పులను ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేసిన కేసులు సైతం అక్కడ సాధారణ ప్రసవాలవుతున్నాయి. మరి ప్రైవేటులో ఎందుకు సాధారణ కాన్పులు కావటం లేదనే ప్రశ్న తలెత్తుతోంది. కేవలం ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు యాజమాన్యాలు శస్త్ర చికిత్స కాన్పులు చేస్తున్నారనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి.


**తనిఖీలు చేస్తేనే అక్రమాలు వెలుగుచూస్తాయి**

ఇటీవల కరీంనగర్ జిల్లాలో ఒక ప్రైవేటు ఆసుపత్రి వారు గర్భిణికి శస్త్రచికిత్స కాన్పు చేసి సాధారణ ప్రసవం అయినట్లు నివేదికల్లో పొందుపరిచారు. వైద్యాధికారులు సదరు బాలింతకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటే ఆమెకు శస్త్ర చికిత్స కాన్పు చేసినట్లు బహిర్గతమైంది. ఈ విధానం జిల్లాలోనూ అమలు చేస్తూ, తరచూ ప్రైవేటు నర్సింగ్‌హోంలను తనిఖీ చేస్తే ఆ ఆసుపత్రుల్లో జరిగే అవకతవకలు వెలుగు చూసే అవకాశాలుంటాయి. కానీ అధికారులు ఈ దిశలో ప్రయత్నం చేయటం లేదనే విమర్శలు చోటు చేసుకున్నాయి.

**ప్రైవేటులో 85 శాతానికి పైగా కోతలే..**

రెండేళ్ల కాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10,952 ప్రసవాలు జరగగా వీటిలో 3,042(27.77శాతం) మాత్రమే శస్త్ర చికిత్స కాన్పులు జరిగాయి. ప్రైవేటులో 5,287 కాన్పులు కాగా 4,403(85.17శాతం) కోతకాన్పులు చేశారు. సంవత్సరాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి.

# ప్రయోగం తుస్... నైపుణ్యం నిల్!



కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలు పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్నాయి. త్వరగా ఉపాధి అవకాశాలు లభిస్తుండటంతో ఐటీఐ విద్యకు డిమాండ్ ఉంది. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు మానవ వనరులను తీర్చిదిద్దటం ఐటీఐ కళాశాలల ప్రత్యేకత. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లోనూ విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. ప్రతి కోర్సుకు సంబంధించి ప్రయోగాలు చేయించాల్సి ఉంటుంది. ప్రయోగ పరీక్షలో ఉత్తీర్ణత తప్పనిసరి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రయోగ పరికరాల కొనుగోలుకు ప్రభుత్వ కళాశాలల్లో నిధుల కొరత వేధిస్తోంది. ఐదేళ్లుగా అరకొర వసతులతో నెట్టుకురావాల్సిన పరిస్థితులు దాపురించాయి.

ఉభయ జిల్లాల్లో నాలుగు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు, 28 ప్రైవేట్ ఐటీఐ కళాశాలలున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో పాత పరికరాలతో ప్రయోగాలు చేయిస్తున్నారు. కొత్త పరికరాల కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైసా నిధులు కేటాయించటం లేదని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. కనీసం చిన్న వైరు ముక్క కొనలేని దుస్థితి దాపురించిందని వాపోతున్నాయి. ప్రయోగాలు చేయలేక.. నైపుణ్యం లేక ఏటా విద్యార్థులు అప్రెంటిస్‌షిప్ కోసం పోటీపడుతున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకోవాల్సి వస్తోంది.

**అందుబాటులోని కోర్సులు**

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కోపా, టర్నర్, డీజిల్ మోటరు మెకానిక్, మెషినిస్ట్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్ డ్రాఫ్ట్స్‌మెన్, మెకానిక్, వెల్డర్, హెల్త్ అండ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, కట్టింగ్ డ్రెస్ మేకింగ్, మోటర్ మెకానికల్.

నేను టర్నర్ కోర్సు అభ్యసిస్తున్నా. కళాశాలలో మరమ్మతులకు గురైన పాత పరికరాలతో అధ్యాపకులు ప్రయోగాలు చేయిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రయోగ పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరు చేయాలి.
చంద్రగిరి రక్షిత్, విద్యార్థి, కొత్తగూడెం రుద్రంపూర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల

పరిశ్రమలకు నెలవుగా ఉన్న జిల్లాలో ఉపాధి అవకాశాలు లభిస్తాయనే ఉద్దేశంతో ఐటీఐ కళాశాలల్లో చేరుతున్నాం. మా కళాశాలలో పదకొండు కోర్సులున్నాయి. ప్రతి కోర్సు విద్యార్థులూ ప్రయోగాలు చేయాల్సి ఉంటుంది. ప్రయోగ పరికరాల లేమితో ఇబ్బందులు పడుతున్నాం.
తాటికొండ కల్పన, విద్యార్థిని, కొత్తగూడెం రుద్రంపూర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల

ప్రభుత్వం 2018 వరకు దశల వారీగా నిధులకు కోత పెడుతూ వచ్చింది. ఐదేళ్లుగా ప్రయోగ పరీక్షలకు అసలు నిధులు మంజూరు కావడం లేదు. గోనెల రమేశ్, ఐటీఐ విద్య జిల్లా నోడల్ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

# నిర్లక్ష్యమా.. పనిభారమా?

మంచిర్యాల : రెండు నెలలుగా ఎంసీహెచ్‌లో ఒకే సమస్య వేధిస్తోంది. బాలింతలకు వేసిన కుట్లు ఊడిపోవడం, ఇబ్బందిగా మారడం. దీంతో బాధిత బంధువులు ఆందోళన చేపట్టడం, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడం కొన్నిరోజులుగా జరుగుతూనే ఉంది. దాదాపు ఇప్పటి వరకు 40 మందికి పైగా ఇలాంటి సమస్యలు ఎదురైనట్లు లెక్కలు చెబుతున్నాయి. ఎప్పుడో ఒకసారి ఎదురయ్యే ఇలాంటి ఘటనలు ప్రస్తుతం పదే పదే జరగడం, గడిచిన రెండునెలల్లో అధికంగా ఉండటంపై బాధితుల బంధువుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆందోళనలు చేసే పరిస్థితి వచ్చింది.

**సమస్య ఎక్కడుంది..?**

శస్త్రచికిత్సలు జరిగిన బాలింతలకు ఇన్‌ఫెక్షన్ ఏ రకంగా వస్తుందో అర్థం కాకుండా ఉంది. కుట్లు వేయడంలో ప్రసూతి వైద్యులు నిర్లక్ష్యం చేస్తున్నారా..? సిబ్బంది బాధితులకు సక్రమంగా డ్రెస్సింగ్ చేయడం లేదా..? బాధితురాలిని ఇష్టారీతిన కుటుంబ సభ్యులు చుట్టుముట్టడంతో తలెత్తుందా..? ప్రస్తుతం తీవ్ర వైద్యుల కొరత ఉండటంతో ఇప్పుడున్న వారిపై తీవ్ర భారం పడుతుండటంతో వస్తుందా.. అనేది తెలియకుండా ఉంది. ఇక్కడి పరిస్థితి చూస్తే వైద్యురాళ్లు ఒత్తిడికి లోనవుతున్నట్లు కనిపిస్తోంది. పనిభారం ఎక్కువ కావడంతోనే ఇలాంటి సమస్యలు వస్తున్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రిలో రోజురోజుకి ప్రసవాల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడంలేదు. కానీ సిబ్బంది మాత్రం పెరగడంలేదు.

**అనుమతి ఉన్నా నియామకం చేపట్టడం లేదు**

ఎంసీహెచ్‌లో వైద్యురాళ్ల నియామకానికి అవకాశమున్నా ప్రభుత్వం చొరవ చూపడం లేదని తెలుస్తోంది. ఎంసీహెచ్‌కు సంబంధించి పది పడకలతో కూడిన ఐసీయూకే ఇద్దరు ప్రసూతి, నలుగురు ఎంబీబీఎస్ వైద్యులు ఉండాలనే నిబంధన ఉందని సమాచారం. అలాంటిది వందపడకల ఆసుపత్రికి ఎంతమంది ఉండాలి..? కానీ మొత్తం కలిపి నలుగురితో నెట్టుకొస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో శస్త్రచికిత్స జరిగే ఇక్కడి కేంద్రంలో కనీసం పదిమంది అయినా లేకపోతే సమస్య పరిష్కారమయ్యే పరిస్థితి కనిపించడంలేదు. వీరికి తోడు ఎంబీబీఎస్ మహిళా వైద్యుల నియామకం చేపడితే ప్రసూతి వైద్యురాళ్లకు తోడ్పాటు అందించే అవకాశం ఉంటుంది. దీంతో పనిభారం తగ్గి బాధితులకు మెరుగైన వైద్యం అందుతుంది.

ఇతని పేరు కుమారస్వామి. ఈయన సతీమణి గర్భిణి కావడంతో చికిత్స కోసం మూడు రోజుల కిందట మంచిర్యాల జీజీహెచ్‌కు వచ్చారు. ఇక్కడి ఓ వైద్యురాలు, సిబ్బంది శస్త్రచికిత్స ద్వారా ప్రసవం చేశారు. కానీ ఓటీ గదిలోనే నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ప్రసవం తర్వాత చాలాసేపటి వరకు కుట్లు వేయకుండా కాలక్షేపం చేసినట్లు సాధారణ వార్డుకు వచ్చిన తర్వాత తన భార్య ఆవేదనతో చెప్పినట్లు ఆయన చెబుతున్నారు.

**సమస్యకు.. అందరిదీ బాధ్యతే**

మంచిర్యాల సిటీ: ఇటీవల కుట్లు ఊడిపోవడం, బాలింతలకు తరచూ ఇబ్బందులు కలుగుతుండటంపై ఫిర్యాదులు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. సుమారు 50 మందికి పైగా ఈ సమస్య తలెత్తడంతో విచారణ చేయించాలని జీజీహెచ్ పర్యవేక్షణాధికారి డా.హరిశ్చంద్రారెడ్డి పాలనాధికారితో పాటు డీఎంఈకి విన్నవించారు. గురువారం సంబంధిత సమస్యపై వివరాలు తెలుసుకునేందుకు హైదరాబాద్ నుంచి ఇద్దరు ప్రసూతి విభాగానికి చెందిన ప్రొఫెసర్ సునీత, అసోసియేటెడ్ ప్రొఫెసర్ నిర్మల వచ్చి ఇక్కడి ఆసుపత్రిలో పర్యటించి సమస్యకు గల కారణాల తెలుసుకున్నారు. ఆయా రిపోర్ట్ పత్రాలను శుక్రవారం అందజేసినట్లు తెలిసింది. బాధితులకు అందించిన చికిత్స వివరాలు తెలుసుకుని ప్రధానంగా కుట్లు వేసిన పద్ధతిని పరిశీలించినట్లు సమాచారం. ఇన్‌ఫెక్షన్స్ ఎందుకు వస్తున్నాయనే అంశంపైనే ప్రత్యేక దృష్టిసారించి వివరాలు ఆ రిపోర్ట్ పత్రంలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ ఇబ్బందికి వైద్యులతో పాటు బాధిత బంధువులు, ఓటీ(ఆపరేషన్ థియేటర్)లోని పరికరాలు, బాలింతలు ధరించే దుస్తులు ఇలా అనేక కారణాలు ఉన్నాయని, దీనికి అందరూ బాధ్యులేనని అందులో తెలిపినట్లు సమాచారం.

# సుపరిపాలనే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం : వజ్రేష్ యాదవ్

శామీర్ పేట (గరుడ వార్త) : ఆరు గ్యారంటీలను అమలుపరుస్తూ ప్రజలకు భద్రతను, భరోసాను కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. గురువారం ప్రజాపాలనలో భాగంగా ముడిచింతలపల్లి మండలంలోని ఉద్దమర్రి, మూడు చింతలపల్లి గ్రామాలలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల శ్రేయస్సు, సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం పథకం ద్వారా ఆరు గ్యారంటీలను అమలుపరచడంలో భాగంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలనను ప్రారంభించిందన్నారు. సంక్షేమ రాజ్యం సుపరిపాలనే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం మని తెలిపారు. ప్రతీ



ఒక్క పేదవాడి సంక్షేమం కోసం పాటుపడే పార్టీ కాంగ్రెస్ పార్టీయేనన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి సంక్షోభంలో ఉన్న తెలంగాణను సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అభివృద్ధి చేసి సంక్షేమం వైపుగా నడిపిస్తుందని చెప్పారు. ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాలలో దరఖాస్తుల స్వీకరణ జోరుగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసిన నక్క ప్రభాకర్ గౌడ్



శామీర్ పేట (గరుడ వార్త) : మంత్రి శ్రీధర్ బాబు ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబునుమ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛ అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# పౌరసరఫరాల సంస్థ గోదాముల తనిఖీ

జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి(గరుడ వార్త) : మేడ్చల్ జిల్లా పరిధిలోని ఏ ఎం సి కీసర లో నిర్వహించబడుతున్న పౌరసరఫరాల సంస్థ గోదాములను అడిషనల్ కలెక్టర్ డి . విజయేందర్ రెడ్డి గురువారం తనిఖీ చేశారు. గోదాం లోని బియ్యం మరియు ఇతర సామగ్రి నిల్వలను మరియు దస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాం ఇన్చార్జలకు 100% తూకం వేస్తూ నిర్ణిత సమయానికి సరుకులను చౌకధరల



దుకాణాలకు సరఫరా చేయాల్సిందిగా మరియు ఆ సమయానికి ఆ గోదాంలో ఉన్నటువంటి చౌకధరల దుకాణాల డీలర్లకు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు అదేవిదంగా లబ్దిదారులకు సరుకులు నిర్ణిత సమయములో అందేలా చూడాలని చౌకధరల దుకాణాల డీలర్లకు ఆదేశించారు. ఈ కార్యక్రమములో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీ. జి. రాజేందర్ మరియు కీసర మండలం తహసీల్దారు శ్రీ. యు. అశోక్ కుమార్ పాల్గొనడం జరిగింది.

# జగన్ గూడాలో రామతీర్థ అక్షింతల శోభయాత్ర

శామీర్ గరుడ వార్త:మూడుచింతలపల్లి మండలంలోని జేగన్ గూడ, సంపన్ బోల్ గ్రామంలో అయోధ్య శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో అందిన పూజిత అక్షింతల శోభాయాత్ర కార్యక్రమం కన్యకాపరమేశ్వర ఆలయం నుండి శ్రీరాముని ఊరేంగింపు జెగన్ గూడ, సంపన్ బోల్,జగన్ గూడ కాలనీ ప్రధాన విధుల్లో నుండి కన్యకా పరమేశ్వరి ఆలయ వద్దకు నిర్వహించడం జరిగింది. ఈ



కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చందుపట్ల విష్ణువర్ధన్ రెడ్డి, సెంట్రల్ ఫిలిం బోర్డ్ మెంబర్ గ్రామ ఉప సర్పంచ్ బుద్ధి శ్రీనివాస్,వార్డు సభ్యులు టిజీ అనిల్ రెడ్డి, వణందాస్ సాయిబా, బాజాంగిర్, బుపాల్, గ్రామ పెద్దలు ఇర్రి రవీందర్ రెడ్డి,నాగరాజు చారి, నరేందర్ రెడ్డి,శ్రీదర్ పంతులు,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది లేక ఇబ్బంది

ఖమ్మం : ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి సరకు రవాణా వాహనాల తనిఖీ, అంతర్రాష్ట్ర పన్నులు వసూలు చేయడంతోపాటు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో రవాణాశాఖ చెక్‌పోస్టులు కీలకం. ఖమ్మం జిల్లాలో ఏకైక రవాణాశాఖ చెక్‌పోస్టు కల్లూరులో ఉంది. జిల్లాలోకి ప్రవేశించే ఏపీ వాహనాలకు సంబంధించిన పన్నుల వసూళ్లతో రవాణా శాఖకు మంచి ఆదాయం వస్తుంది. ఇలాంటి కీలక చెక్‌పోస్టులో ఒక్కరే మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక్కడ ఆన్‌డ్యూటీ(డిప్యుటేషన్)లో పనిచేస్తున్న ఇద్దరిని ప్రభుత్వం పాత స్థానాలకే పరిమితం చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఈనెల 29న జారీ చేయగా.. తక్షణమే ఇద్దరు ఎంవీఐలు తమ పాత స్థానాలకు వెళ్లారు. కల్లూరు చెక్‌పోస్టులో ఒక్కరే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఫలితంగా వాహనాల తనిఖీలు, పన్నుల వసూళ్లలో ఎదురవుతున్నాయి.

24 గంటలు.. ఒక్కరే విధులు

కల్లూరు చెక్‌పోస్టు విధుల్లో ముగ్గురు ఎంవీఐలు తప్పక ఉండాలి. ఇప్పటివరకు సత్తుపల్లి, ఆదిలాబాద్ ఎంవీఐలు వెంకటపుల్లయ్య, మనోహర్‌తో పాటు రెగ్యులర్ ఎంవీఐ విజయలక్ష్మి 8 గంటల చొప్పున 24 గంటలు విధులు నిర్వర్తిస్తున్నారు. వెంకటపుల్లయ్య, మనోహర్ డిప్యుటేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. వారు పాత స్థానాలకు వెళ్లారు.



విజయలక్ష్మి ఒక్కరే విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తనిఖీలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో ఎంవీఐల కొరత ఉండటంతో కల్లూరు చెక్‌పోస్టుకు కేటాయించడం రవాణా శాఖకు తలనొప్పిగా మారింది. కల్లూరు చెక్‌పోస్టు డిప్యుటేషన్‌తో పాటు సత్తుపల్లి ఆర్టీఏ కార్యాలయంలోనూ వెంకటపుల్లయ్య బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఆయనను సత్తుపల్లికి కేటాయించడంతో కల్లూరు చెక్‌పోస్టు వద్ద పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.

వేధిస్తున్న ఎంవీఐల కొరత

ఖమ్మం జిల్లా రవాణా శాఖను ఎంవీఐల కొరత వేధిస్తోంది. ఖమ్మం, సత్తుపల్లి, వైరా ఆర్టీఏ కేంద్రాల్లో ఒక్కొక్కరు మాత్రమే విధుల్లో ఉంటున్నారు. వీరిలో ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో సెలవుపై వెళితే భద్రాద్రి కొత్తగూడెం నుంచి ఆ రోజుకు డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి విధులు కేటాయించాల్సిన పరిస్థితి. ఖమ్మంలో ఇద్దరు ఎంవీఐలు, ఇద్దరు సహాయ ఎంవీఐలు ఉండాలి. ఒక్కరు మాత్రమే కొనసాగుతున్నారు. వైరాకు ఒక్కరే ఉన్నారు. సత్తుపల్లిలో ఒక ఎంవీఐ, ఒక సహాయ ఎంవీఐ పనిచేయాల్సి ఉండగా మూడేళ్లుగా ఎంవీఐ పోస్టు ఖాళీగా దర్శనమిస్తోంది. కల్లూరు చెక్‌పోస్టులో కొనసాగుతున్న ఎంవీఐలలో ఒకరికి రోజూ సత్తుపల్లి ఆర్టీఏ కార్యాలయంలో విధులు కేటాయిస్తూ వాహనదారులు, దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. కల్లూరు చెక్‌పోస్టులో సైతం ఒక ఎంవీఐ, ముగ్గురు ఏఎంవీఐలు విధులు నిర్వర్తించాల్సి ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

కల్లూరు రవాణాశాఖ చెక్‌పోస్టులో ఎంవీఐల డిప్యుటేషన్ రద్దు వల్ల కలిగే ఇబ్బందులను రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికే ఈ విషయంపై లేఖ రాశాం. జిల్లాలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల కొరత ఉన్నమాట వాస్తవమే. విధుల్లో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.తోట కిషన్‌రావు, ఖమ్మం జిల్లా రవాణాశాఖాధికారి

# మెగా డీఎస్సీపై చిగురిస్తున్న ఆశలు

ఆదిలాబాద్ : ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ సమీక్షలో భాగంగా బడులు లేని గ్రామాలు ఉండకూడదని, మూతబడిన పాఠశాలలను తిరిగి తెరిపించేలా నియామకాలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు నిలిచిన టీచర్ల పదోన్నతుల ప్రక్రియను కొనసాగించే చర్యలు చేపట్టాలని సూచించడంతో మెగా డీఎస్సీ నిర్వహణ దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ పరిణామాలు నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆశలు చిగురింపజేస్తున్నాయి.గత ప్రభుత్వ హయాంలో సెప్టెంబరు 9న జిల్లా ఎంపిక కమిటీ(డీఎస్సీ) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్‌టీ) పేరిట నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అక్టోబరులో ముగియగా.. నవంబరు 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షల నిర్వహణకు రాత పరీక్షలకు షెడ్యూల్ విడుదలైనా.. ఎన్నికల దృష్ట్యా ఆ పరీక్షలు వాయిదాపడ్డాయి. తీరా ఇప్పుడు భారాస ప్రభుత్వ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. నిలిచిన పదోన్నతులపైనా ప్రభుత్వం దృష్టిసారించడంతో పాటు మూతపడిన బడులను తెరిపించేలా చర్యలు ప్రారంభించడంతో మరిన్ని పోస్టులు పెరగనున్నాయి.టెట్కూ అవకాశం ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో అర్హత సాధిస్తేనే డీఎడ్, బీఎడ్ పూర్తిచేసిన అభ్యర్థులు డీఎస్సీ రాయొచ్చు. మెగా డీఎస్సీ దిశగా సర్కారు యోచిస్తుండటంతో వేలాది మంది నిరుద్యోగులకు మేలు జరిగేలా తొలుత టెట్ను, ఆ తర్వాత డీఎస్సీ ప్రకటన విడుదల చేస్తారనే మాట విద్యాశాఖ వర్గాల నుంచి వినిపిస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి నియామక ప్రక్రియ ముగిసేలా కసరత్తు ప్రారంభం కానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగితే మాత్రం నిరుద్యోగుల ఆశలు ఫలించినట్లే. నిరాశతో ఇప్పటికే పుస్తకాలను పక్కనబెట్టిన నిరుద్యోగులు మళ్లీ రెట్టించిన ఉత్సాహంతో పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

పెరగనున్న పోస్టులు ఇప్పటికే పీజీహెచ్ఎంల పదోన్నతుల ప్రక్రియ ముగియడంతో.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 160 మంది స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి లభించింది. పదోన్నతితో ఖాళీ అయిన పోస్టులను 70 శాతం మేర ఎస్జీటీలకు రిజర్వు చేయగా.. మిగిలిన 30 శాతం పోస్టులను రిక్రూట్మెంటు ద్వారా భర్తీ చేస్తారు. నిలిచిన ఎస్జీటీ పదోన్నతులు జరిగితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 500కి పైగా పోస్టులు ఖాళీ అవుతాయి. ఈ పోస్టులన్నింటిని మెగా డీఎస్సీలో భర్తీ చేయవచ్చు. ఒక్కో జిల్లాలో దాదాపు సగం పోస్టులు కొత్త డీఎస్సీలో పెరిగే అవకాశముంది.ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం- నరేందర్, జిల్లా అధ్యక్షుడు, ఎస్జీటీల సంఘంకొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విద్యాశాఖను గాడిలో పెట్టే క్రమంలో మెగా డీఎస్సీ నిర్వహణకు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగింపునకు సానుకూలత వ్యక్తం చేయడాన్ని స్వాగతిస్తున్నాం. మూతబడిన పాఠశాలలను తెరిపిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం ప్రాథమిక విద్యను బలోపేతం చేసేలా ఉంది. అటు ఉపాధ్యాయులకు, ఇటు నిరుద్యోగులకు మేలు జరిగే చర్యలు వేగవంతం చేయాలి.

# బొగ్గు బ్లాకులపై ప్రభుత్వం దృష్టి



గోదావరిఖని: సింగరేణి బొగ్గుబ్లాకుల వేలంపై రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సింగరేణికి చెందిన నాలుగు బొగ్గుబ్లాకులను కేంద్ర ప్రభుత్వం వేలం జాబితాలో చేర్చడంతో రెండేళ్లుగా వాటిపై సంస్థకు అజమాయిషీ లేకుండా పోయింది. కార్మిక సంఘాలు సైతం బొగ్గుబ్లాకుల వేలాన్ని వ్యతిరేకించాయి. వేలంలో పాల్గొనాలా వద్దా అన్న సందిగ్ధంలో ఉన్న యాజమాన్యానికి సంస్థకు మేలు జరిగే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీనిపై మూడు రోజుల క్రితం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బొగ్గుబ్లాకుల వేలం విషయాన్ని ఉన్నతాధికారులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం మూడుసార్లు టెండర్లు ఆహ్వానించగా మూడు బొగ్గుబ్లాకులకు ఎవరూ బిడ్డింగ్ దాఖలు చేయలేదు. కేవలం కోయగూడెం ఓసీపీ-3కి మాత్రమే ఒక టెండరు దాఖలైంది.

స్పష్టత వస్తే మేలు

సింగరేణి సంస్థ అన్వేషణ పనులు పూర్తి చేసి బొగ్గు నిక్షేపాలను గుర్తించింది. ప్రాజెక్టు నివేదికలు తయారు చేసుకున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బొగ్గుబ్లాకుల కేటాయింపు విధానంతో వేలం జాబితాలో చేర్చింది. దీంతో ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి ఓసీపీ-3, మంచిర్యాల జిల్లాలోని కేకే-6, శ్రావణ్‌పల్లి ఓసీపీ-3 బ్లాకులకు మూడు సార్లు టెండర్లు పిలిచారు. వాటికి బిడ్డింగ్ దాఖలు చేయకపోవడంతో మళ్లీ టెండర్లు పిలిచే అవకాశం ఉంది. దీనివల్ల కొత్తగా గనులు ఏర్పాటు చేసుకునే అవకాశాలు లేకపోవడంతో భవిష్యత్తులో తలెత్తే ఇబ్బందులను అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై లోతుగా చర్చించి సంస్థకు మేలు జరిగే విధంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గనులకు టెండర్లు లేకుండా చేయడమా..? లేదంటే ఇతరులతో పాటు టెండర్లలో సింగరేణి కూడా పాల్గొనడమా అన్న దానిపై స్పష్టత రానుంది.

భవిష్యత్తుపై ఆశలు...

సింగరేణి గనులపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించడంతో భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి విజ్ఞప్తి వెళ్లినా పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది. ఇతర రాష్ట్రాలకు చెందిన బొగ్గుబ్లాకుల విషయంలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో సానుకూల ఫలితాలు వచ్చాయి. గుజరాత్‌కు సంబంధించి అక్కడి గనుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని కేంద్రం పరిగణలోకి తీసుకొని గనులను వారికే కేటాయించింది. గతంలో ఈ ప్రయత్నం చేయకపోవడంతో కేంద్ర ప్రభుత్వం మూడుసార్లు టెండర్లు ఆహ్వానించింది. సింగరేణిలో ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇతర సంస్థలు టెండరు వేసేందుకు ముందుకు రాలేదు. కార్మిక సంఘాల ప్రమేయం ఎక్కువగా ఉండటంతో పాటు వేలం విషయంలో సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలు మూడు రోజులు సమ్మె నిర్వహించాయి. ఈ విషయంలో కార్మిక సంఘాలన్నీ కలిసి కేంద్ర మంత్రిని కలవాలని నిర్ణయించాయి. దీనికి యాజమాన్యం ప్రతినిధులు కూడా కలిసి రావాలని నిర్ణయించారు. కాగా టెండర్లలో ఎవరూ పాల్గొనకపోవడంతో కేంద్ర బొగ్గుశాఖ మంత్రిని కలిసే అంశంలో జాప్యం జరిగింది.

చొరవ తీసుకుంటే పెరగనున్న ఉపాధి

సింగరేణికి చెందిన నాలుగు బొగ్గుబ్లాకులు సంస్థకు దక్కే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకుంటే బొగ్గు ఉత్పత్తితో పాటు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. సింగరేణికి చెందిన నాలుగు బొగ్గుబ్లాకుల వల్ల ఏటా 20 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీసే అవకాశం ఉంది. ఒక్కో గనిలో కనీసం 500 మంది చొప్పున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నాలుగు బొగ్గుబ్లాకులను సింగరేణికి కేటాయించాలన్న ఆమోదం లభిస్తే విద్యుత్తు కేంద్రాలకు సరిపడా బొగ్గును అందించడంతో పాటు కొత్త గనులు ప్రారంభించుకునేందుకు సంస్థకు మార్గం సుగమం అవుతుంది.

# మామిడిమండీ అభివృద్ధికి అడుగులు



జగిత్యాల : తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచిన జగిత్యాల చల్‌గల్ మామిడి మార్కెట్ ఈ సీజన్‌కు పూర్తిస్థాయిలో లావాదేవీల నిర్వహణకు సిద్ధమవుతోంది. గతంలో చల్‌గల్‌లో గల వాలంతరి ప్రదర్శన క్షేత్రం నుంచి తీసుకున్న 23 ఎకరాల స్థలంలో గోదాములు, రైపెనింగ్ ఛాంబర్, వేయింగ్‌షెడ్లు, మార్కెట్ కార్యాలయం, రెండు ధర్మకాంటాలు తదితర నిర్మాణాలున్నాయి. తూర్పు వైపున దినుసుల బీటుకు, పశ్చిమం వైపున మామిడి మండీకి స్థలాన్ని కేటాయించారు. మామిడి యార్డులో రూ.5.20 కోట్ల నిధులతో లక్ష చదరపు అడుగులతో నాలుగు భారీ షెడ్లు నిర్మించారు. షెడ్ల నిర్మాణం పూర్తికావటంతో వ్యాపారులందరూ తప్పనిసరిగా యార్డులోనే మామిడి కాయల కొనుగోలు, ప్యాకింగ్, తరలింపు తదితర కార్యకలాపాలను చేపట్టాల్సి ఉంటుంది.

రూ.కోటి నిధులతో..మామిడి మండీకి స్థలం సరిపోనందున వాలంతరి ప్రదర్శన క్షేత్రం నుంచి మరో 10 ఎకరాల స్థలాన్ని తీసుకున్నారు. ఈ స్థలంలోనూ శాశ్వత షెడ్లను నిర్మించాలని వ్యాపారులు కోరుతున్నారు. యార్డులోని రైపెనింగ్ ఛాంబర్‌ను వేలం ద్వారా వ్యాపారులకు కేటాయించనుండగా రెండు ధర్మకాంటాల ద్వారా మామిడి కాయల తూకాన్ని నిర్వహించనున్నారు. 95 మంది వరకు వ్యాపారులు మామిడి మండీలోనే కాయల లావాదేవీలను జరపాలని మార్కెటింగ్ వర్గాలు నిర్ణయించాయి. మండీకి అదనంగా మంజూరు చేసిన రూ.కోటి నిధులతో అంతర్గత రహదారులు, మంచినీరు, విద్యుత్తు, కార్మికులకు మరుగుదొడ్లు తదితర సదుపాయాలను కల్పించాల్సి ఉంది.

రైతులకు మేలు నిబంధనల ప్రకారం కమీషన్ తీసుకునే వ్యాపారులు కాయలను బహిరంగ వేలం పద్ధతిన కొనుగోలు చేయాల్సి ఉన్నా యార్డులో అభివృద్ధి పనులు పూర్తిగాకపోవటం, వ్యాపారులు వారి సొంత స్థలాల్లోనే సేకరణ చేసినందున గత సీజన్లలో వేలానికి వీలుకాలేదు. అభివృద్ధి పనులు పూర్తయ్యి వ్యాపారులందరూ ఒకేచోట ఉండనుండడంతో వచ్చే సీజన్‌లో వేలం చేపడతామని అధికారులు పేర్కొంటున్నారు. నాగ్‌పూర్, ఢిల్లీ, హైదరాబాద్, విజయవాడ తదితర మామిడి మార్కెట్ల ధరలను ప్రతిరోజూ తెలిపేలా చల్‌గల్ మండీలో ఆన్‌లైన్ తెర, ధరల ప్రదర్శనతో రైతులకు మేలు కలగనుంది. కిసాన్ రైలు ద్వారా ఉత్తరాది రాష్ట్రాలకు కాయల ఎగుమతికి అవకాశముండటం, మామిడిలో పూత ఆశించినట్లుగా వస్తుండటం, వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే మంచి కాపుతో పాటుగా అధిక ధర దక్కుతుందని రైతులు, తోటల గుత్తేదారులు ఆశగా ఉన్నారు.

# పాస్‌పోర్టు సేవా కేంద్రాల వద్ద దళారుల బెడద



హైదరాబాద్: పాస్‌పోర్టు సేవా కేంద్రాల వద్ద అక్రమ ఏజెంట్లు, మధ్యవర్తుల కదలికలు పెరిగిపోతున్నాయి. త్వరగా పాస్‌పోర్టు ఇప్పిస్తామని, అపాయింట్‌మెంట్ ఆలస్యమైతే అధికారులతో మాట్లాడి పని పూర్తి చేస్తామంటూ వేల రూపాయలు కొల్లగొడుతున్నారు. తీరా అనుకున్న సమయానికి ఫోన్లు ఎత్తకపోయేసరికి మోసపోయామని బాధితులు ఫిర్యాదులు చేస్తున్నారు. మహంకాళి, ఎస్సార్‌నగర్, బేగంపేట్ పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో దళారుల బెడద అధికంగా ఉంటోంది. గతంలో ఇక్కడ పాస్‌పోర్టు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన సమయంలోనూ కేటుగాళ్లను అరెస్టు చేసిన సందర్భాలున్నాయి. గత డిసెంబర్‌లోనే 10 మందికి పైగా బాధితులు న్యాయం చేయాలంటూ ఫిర్యాదులు చేశారని పాస్‌పోర్టు అధికారులు తెలిపారు. ధ్రువపత్రాల్లో పొరపాట్లు, పాస్‌పోర్టు రెన్యువల్ గడువు ముగిసిన ఏళ్ల తర్వాత దరఖాస్తు చేసుకునేవారు మోసపోయి ఫిర్యాదులు చేయడానికి ముందుకు రావడం లేదు.

పీఎస్‌కేల వద్దే ఉంటూ..

ఇటీవల ఉప్పల్‌కు చెందిన రాజు అనే వ్యక్తి పాస్‌పోర్టు రెన్యువల్ అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించగా... 30 రోజుల తర్వాత అపాయింట్‌మెంట్ లభించింది. అత్యవసరంగా విదేశాలకు వెళ్లాల్సిరావడం, అప్పటికే పాస్‌పోర్టు రెన్యువల్ గడువు ముగియడంతో ఇబ్బందులు తప్పవని మధ్యవర్తులను ఆశ్రయించి రూ.15వేలకు బేరం కుదుర్చుకున్నారు. సొమ్ము అందాక మధ్యవర్తి ఫోన్‌కు స్పందించకపోయేసరికి మోసపోయినట్టు గ్రహించాడు. సాధారణ పాస్‌పోర్టులకు సగటున 22 రోజులు, తత్కాల్‌లో వారం రోజుల్లో అపాయింట్‌మెంట్ లభిస్తుందని పాస్‌పోర్టు అధికారులు చెబుతున్నారు. సమస్యలు ఉంటే విచారణ కేంద్రాల్లో పరిష్కరించుకోవచ్చని, ధ్రువపత్రాల పరిశీలన, పోలీస్ వెరిఫికేషన్ పూర్తయిన వారం రోజుల్లో పాస్‌పోర్టు చేతికొస్తోందని సూచిస్తున్నారు.

# శస్త్రచికిత్సల్లో మైలురాయి

ఖమ్మం : ఖమ్మం సర్వజనాసుపత్రి శస్త్రచికిత్సల నిర్వహణలో ఈ ఏడాది పది వేల మైలురాయిని దాటింది. ఆస్పత్రిలోని పది విభాగాల్లో చికిత్సలు కొనసాగగా.. 2023 జనవరి నుంచి డిసెంబరు నాటికి 10,789 శస్త్రచికిత్సలు పూర్తి చేశారు. వైద్య నిపుణులు కొన్ని విభాగాల్లో మాత్రమే ఆసక్తి కనబరుస్తూ చికిత్సలు నిర్వహించినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రధానంగా మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో కాన్పు శస్త్రచికిత్స(సిజేరియన్), మహిళల్లో కుటుంబ నియంత్రణ(ట్యూబెక్టమీ) శస్త్రచికిత్సలు ఎక్కువ సంఖ్యలో జరిగాయి. ముఖ్యమైన కీళ్ల(ఆర్థో), సాధారణ, నేత్ర విభాగాల్లో మాత్రం ఆశించిన స్థాయిలో ఆపరేషన్లు చేయలేదు. గుండె జబ్బుల(కార్డియాలజీ) విభాగంలోనూ ఔషధ కొరత కారణంగా పలుమార్లు చికిత్సలు నిలిచిపోయాయి. ఇక దంత, గొంతు, చెవి, ముక్కు(ఈఎన్‌టీ) విభాగాలు



బాగా వెనకబడ్డాయి. మరోవైపు గర్భాశయం తొలగింపు(హిస్ట్రోక్టమీ), పురుషుల్లో కుటుంబ నియంత్రణ(వాసెక్టమీ) చికిత్సలకు అంత ప్రాధాన్యం కల్పించలేదు. చికిత్సలు తక్కువ జరిగిన ఆయా విభాగాల్లో రోగుల నుంచి స్పందన కన్పించినా వైద్య నిపుణులు సకాలంలో స్పందించకపోవడం, ఆసక్తి కనబరచకపోవడం, పరికరాలు అందుబాటులో లేకపోవడం వంటి విషయాలు కొంత ప్రభావం చూపాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త సంవత్సరంలో అయినా వైద్యాధికారులు సేవలకు మరింత ప్రాధాన్యమివ్వాలని రోగులు కోరుతున్నారు.

# నాగోబా చెంత.. సమస్యల చింత

ఇంద్రవెల్లి : ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబా జాతర ఫిబ్రవరి 9న మహాపూజలతో ప్రారంభం కానుంది. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. నాగోబా మహాపూజ రోజున 50 వేలకు పైగా భక్తులు హాజరవుతారని మెస్రం వంశీయుల అంచనా. రాష్ట్రంలోనే ఆదివాసీలు ఘనంగా నిర్వహించే నాగోబా జాతరను ప్రభుత్వం అధికారికంగా వారం రోజుల పాటు నిర్వహిస్తుంది. భక్తులకు అసౌకర్యం కలగకుండా కలెక్టర్ పర్యవేక్షణలో ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లు చేస్తుంటారు. తాత్కాలికంగా పనులు చేపట్టేందుకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారే తప్ప శాశ్వత పనులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని గిరిజనులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రులు నాగోబా ప్రజా దర్బార్‌లో వేలాది మంది గిరిజనుల మధ్య నాగోబా జాతర సందర్భంగా ఇచ్చిన హామీలు జీఓలకే పరిమితమయ్యాయని గిరిజనులు అంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో ఇక్కడి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతారని గిరిజనులు ఎదురు చూస్తున్నారు.

ముఖ్యమైన సమస్యలివి..

భక్తుల కోసం కేవలం 20 మరుగుదొడ్లు, 20 స్నానపు గదులను ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా రూ.లక్షలు ఖర్చు చేసి తాత్కాలికంగా మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయడంతో శాశ్వతంగా పరిష్కారం లభించడం లేదు. శాశ్వతంగా మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలి.

నాగోబా దేవుడికి నైవేద్యం వండే గోవాడ లోపాల ఫ్లోరింగ్(గచ్చు) పాడైంది. వెంటనే మరమ్మతులు చేయాలి.

మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల కోసం 1990లో నిర్మించిన వసతిగృహం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. 2014లో జరిగిన నాగోబా ప్రజా దర్బార్‌కు హాజరైన అప్పటి మంత్రులు ఐకేరెడ్డి, జోగు రామన్నలు రూ.కోటి వ్యయంతో వసతిగృహ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చినా నేటికి పనులు ప్రారంభం కాలేదు.

మర్రిచెట్ల వద్ద అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని గత ప్రభుత్వ పెద్దలు హామీ ఇచ్చినా నేటికీ అక్కడ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.జాతర నిర్వహించే స్థలం మొత్తం గుంతలమయంగా ఉంది. ఈ స్థలాన్ని ఉపాధి హామీ పథకంలో చదును చేయిస్తామని అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పినా నెరవేరలేదు.

హర్కాపూర్, కేస్లాపూర్ రహదారిని తారు రోడ్డుగా నిర్మిస్తామని అప్పటి మంత్రులు హామీ ఇచ్చారు. నేటికీ తారు రోడ్డు వేయలేదు.

ఇచ్చిన హామీలు నెరవేరడం లేదు..-మెస్రం వెంకట్‌రావు, ఆలయ పీఠాధిపతి

ఏటా నాగోబా జాతర సందర్భంగా దర్బార్‌లో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు హామీలు ఇస్తున్నారే తప్ప అమలు కావడం లేదు. ఆలయం చుట్టూ ప్రహరీలు ఆరు సంవత్సరాలుగా నిర్మిస్తున్నా పూర్తి కావడం లేదు. జాతరకు వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు రాష్ట్రస్థాయి అధికారుల కోసం వసతిగృహం మంజూరు చేసినట్లు ప్రకటించినా పనులు ప్రారంభం కావడం లేదు.

తారురోడ్డు వేయాలి-మెస్రం రేణుక, సర్పంచి

హర్కాపూర్ నుంచి కేస్లాపూర్ వరకు తారు రోడ్డు పనులు హామీలకే పరిమితమయ్యాయి. ముత్నూరు నుంచి కేస్లాపూర్ నాగోబా ఆలయం వరకు రూ.6 కోట్లతో రెండు వరుసల తారు రోడ్డుతో పాటు డివైడర్, విద్యుత్తు సౌకర్యం కల్పిస్తామని అప్పటి గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రకటించి రెండేళ్లయినా పనులు ప్రారంభం కావడం లేదు.

# ట్రాఫిక్ కమిషనరేట్ లేనట్లేనా?

హైదరాబాద్ : రాజధానిలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మూడు పోలీసు కమిషనరేట్లలోని ట్రాఫిక్ విభాగాలను కలిపి ట్రాఫిక్ కమిషనరేట్‌ను ఏర్పాటు చేయాలన్న నాలుగైదేళ్ల నాటి ప్రతిపాదన కార్యరూపం దాల్చడం లేదు. 3 కమిషనరేట్లలో దాదాపు 8 వేల మంది ట్రాఫిక్ పోలీసులున్నా ప్రతిరోజూ కనీసం సగం మంది కూడా నగర రోడ్లపై విధులు నిర్వహించడం లేదు.ట్రాఫిక్ కమిషనరేట్ ఏర్పాటు చేస్తే దానికి ప్రత్యేకంగా కమిషనర్‌ను, డీసీపీలను నియమిస్తే ట్రాఫిక్ సమస్య కొలిక్కి వస్తుందన్నది పోలీసు శాఖ ఆలోచన. దీని ప్రతిపాదనపై కదలిక లేదు.

ఎక్కడైనా వాహనం రోడ్డుపై ఆగిపోతే అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. నిమిషాల వ్యవధిలో ఆగిన వాహనాన్ని తీయగలిగితే ట్రాఫిక్ ఇబ్బంది ఉండదు. కానీ అలా జరగడం లేదు. లారీల సమ్మెతో మంగళవారం పెట్రోలు బంకుల దగ్గర వాహనాలు వరుస కట్టడంతో నగరం మొత్తం ట్రాఫిక్ స్తంభించింది. ఈ పరిస్థితిని ముందే ఊహించి తక్షణం చర్యలు తీసుకుంటే ఇబ్బంది ఉండేది కాదు.ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా గతంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో ప్రయోగాలు చేశారు. ట్రాఫిక్‌ను మళ్లించడం ద్వారా కొన్ని రూట్లలో సమస్య తీరడానికి అవకాశం ఏర్పడింది. అలా నగరమంతా కొత్త రూట్లను ఎంపిక చేస్తే ఫలితం ఉంటుందని నిపుణులంటున్నారు.

# ప్రాణాధార మందులకు కృత్రిమవేర్లు

హైదరాబాద్ :ప్రాణాధార మందుల్లో వినియోగించే ఔషధ మొక్కలు.. వేర్లను ఉస్మానియా వర్సిటీలోని సెంటర్ ఫర్ ప్లాంట్ మాలిక్యులార్ బయాలజీ విభాగం(సీపీఎంబీ) శాస్త్రవేత్తలు ప్రయోగశాలలోనే సృష్టిస్తున్నారు. టిష్యూ కల్చర్ ఆధారంగా అత్యాధునిక సమాచార సాంకేతికతతో సహజ, కృత్రిమ వాతావరణాన్ని ఏర్పాటుచేసి వందల సంఖ్యలో వేర్లు తయారు చేస్తున్నారు. గతంలో 4 రకాల ఔషధ మొక్కల వేర్లను తయారుచేస్తుండగా.. ప్రస్తుతం 9 మొక్కల వేర్లు సృష్టిస్తున్నారు. ఇలా ఉత్పత్తైన వేర్లను ప్రాణాధార మందుల తయారీ సంస్థలకు అందజేస్తున్నారు. ప్రధానంగా క్యాన్సర్ నియంత్రణ మందుల సంస్థలకు వీటిని అందజేస్తున్నామని సీపీఎంబీ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. క్యాన్సర్‌ను నియంత్రించే మందుల తయారీలో కొన్ని అరుదైన ఔషధ మొక్కలు, చెట్లవేర్లు అవసరం. వీటి పెంపకానికి మైదానాల్లో స్థలం అవసరం కావడం, వేర్లు తీశాక ఆకులు, కాండం వృథా అవుతుండడంతో.. ఆయా సమస్యలు నివారణకు ఈ విధానాన్ని ఎంచుకున్నారు. కృత్రిమమేధ, ఇతర ఆధునిక పద్ధతులు అందుబాటులోకి రావడంతో వాటిపై అధ్యయనం చేస్తున్నారు.

నెలరోజుల్లోపే: ప్రయోగశాలలో పెంచుతున్న ఔషధ మొక్కల వేర్లు



నెలరోజుల్లోపే తయారవుతున్నాయి. సహజంగా పెరుగుతున్న ఒక ఔషధ మొక్కను ల్యాబ్‌కు తెచ్చి రసాయన ప్రక్రియ ద్వారా దాన్ని జీవించేలా చేస్తున్నారు. అనంతరం టిష్యూకల్చర్ ద్వారా వాటి కణాలను ప్రయోగశాలలో రూపొందించి పదుల సంఖ్యలో వేర్లను సృష్టిస్తున్నారు. రెండో విధానంలో టిష్యూకల్చర్ ద్వారా కృత్రిమవేర్లను సృష్టించి వాటి ఆధారంగా పదుల సంఖ్యలో వేర్లను తయారు చేస్తున్నారు. ఇది మందులతయారీ సంస్థలకు ఉపయోగపడనుందని సంచాలకులు డాక్టర్ కె.రామకృష్ణ అన్నారు.

గాజుసీసాల్లో వేర్ల తయారీ...

క్యాన్సర్ వంటి ప్రాణాపాయ వ్యాధుల నియంత్రణకు ఉపయోగపడే ఔషధ మొక్కల వేర్లను సీపీఎంబీ శాస్త్రవేత్తలు గాజు సీసాల్లో సృష్టిస్తున్నారు. ఒకచదరపు మీటర్ స్థలంలో సీసాల్లో వేర్లను పెంచుతున్నారు. ఒక సీసాలో పదుల సంఖ్యల వేర్లు పెరిగేలా చర్యలు చేపడుతున్నారు. మైదానాలు, పొలాలు, ఇతర ప్రాంతాల్లో ఔషధ మొక్కలు, చెట్లు పెరిగేవాతావరణం ఉండేలా కృత్రిమ పద్ధతులు అవలంబిస్తున్నారు. బోన్సాయ్ మొక్కల తరహాలో వేర్లు పెరిగాక ఒకటి, రెండు ఆకులు చిన్నగా కనిపించగానే.. వాటి వేర్లను తీసుకుంటున్నారు. వేర్లు పెరిగే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తుండడంతో ఔషధ మొక్కల కృత్రిమ వేర్లు అనుకున్న రీతిలో పెరుగుతున్నాయి.

# ఆర్టీసీ స్థలం ఆక్రమణలమయం

మంచిర్యాల :పారిశ్రామిక ప్రాంతమైన కాగజ్‌నగర్‌లో ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరవైంది. ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. పట్టణం దినదినం అభివృద్ధి చెందడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఖాళీ, ప్రభుత్వ స్థలాలపై కన్నేస్తున్నారు. ఆర్టీసీ స్థలాన్ని ఆక్రమించుకుని పక్కా నిర్మాణాలు చేస్తున్నట్లు బల్దియాలోని పాలకవర్గం నేతపై సంబంధిత అధికారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మళ్లీ ఆర్టీసీకి సంబంధించిన స్థలంలోనే ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. కొందరు పోటీపడి సిమెంటు స్తంభాలు, కర్రలను పాతి హద్దులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం, రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ ఆక్రమణలు కొనసాగుతున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

కొన్నేళ్ల క్రితం ఇలా..

కాగజ్‌నగర్ పెట్రోల్‌పంపు ఏరియాలోని సర్వే నెం.143, 147లో మొత్తం 6.50 ఎకరాల స్థలాన్ని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం, డిపో, తదితర అవసరాల నిమిత్తం అప్పట్లో ప్రభుత్వం ప్రైవేటుపట్టాదారుల నుంచి మార్కెట్ ధరను బట్టి కొనుగోలు చేశారు. ప్రయాణప్రాంగణ



నిర్మాణం జరగ్గా డిపో, ఇతర స్థలం కొన్నేళ్లుగా పిచ్చిమొక్కలతో ఖాళీగా ఉంది. ఆ స్థలం పక్కనే ఓ పెద్ద వరద కాలువ దాదాపు 50 నుంచి 60 ఫీట్లు ఉండేది. రెవెన్యూ రికార్డుల్లో ప్రైవేటు వ్యక్తుల పేర్లు మార్పు లేకపోవడంతో వారి కుటుంబీకులు ఆ స్థలం తమదేనంటూ పలువురికి ఏకంగా వరదనీటి కాలువతోపాటు, ఆర్టీసీ స్థలాన్ని కూడా రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ రిజిస్ట్రేషన్ పత్రాలను ఆసరాగా చేసుకుని వరద కాలువతోపాటు ఆర్టీసీ స్థలం కూడా ఆక్రమణకు గురైంది.

రెండు రోజులుగా ..

ఆర్టీసీ అధికారులు ప్రస్తుతం ఉన్న స్థలాన్ని కబ్జా కాకుండా హద్దులు ఏర్పాటు చేసుకుని ఓ వైపు మాత్రమే ప్రహరీ పనులు ప్రారంభించారు. మరో వైపు ఖాళీ స్థలం ఉండటంతో రెండ్రోజులుగా ఆ స్థలంలో పలువురు పోటాపోటీగా పిచ్చిమొక్కలను తొలగించి సిమెంటు స్తంభాలు, కర్రలను పాతారు. మరికొందరూ ఏకంగా రేకులను ఏర్పాటు చేసుకుని షెడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఒకరిని చూసి మరొకరు ఆ ఖాళీ స్థలాన్ని పూర్తిగా ఆక్రమించుకుంటున్నారు.

సర్వే చేయిస్తాం

–శ్రీధర్, డిపో మేనేజర్, ఆసిఫాబాద్

ఆర్టీసీ స్థలం రీసర్వే చేయిస్తాం. ఆ స్థలాన్ని ఆక్రమించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలను సత్వరమే తొలగించాలని పురపాలిక, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఆర్టీసీ స్థలం ఆక్రమణ జరగకుండా కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

# ఆర్టీసీలో సమ్మె సైరన్!




కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మహాలక్ష్మి పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా ఆర్టీసీ బస్సు (ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు)ల్లో మహిళలకు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించింది. దీంతో మహిళా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఇలాంటి తరుణంలో ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 5న నుంచి సమ్మెబాట పట్టడానికి నిర్ణయించడం ప్రభుత్వానికి ఇబ్బందిగా మారనుండగా.. ప్రయాణికులకు అవస్థలు తప్పేలా లేవు.కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోలు ఉండగా వీటి పరిధిలో 861 బస్సులు ఉన్నాయి. ఇందులో ఆర్టీసీ 524, అద్దె బస్సులు 337 ఉన్నాయి. ఆర్టీసీకి సంబంధించి 188 పల్లె వెలుగు, 19 మినీ పల్లె వెలుగు బస్సులు ఉండగా 119 ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. అద్దె బస్సుల్లో 107 ఎక్స్‌ప్రెస్‌లు, 230 పల్లె వెలుగు బస్సులు సేవలందిస్తున్నాయి. మొత్తం మీద ఆర్టీసీ, అద్దె బస్సులు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు 663 ఉన్నాయి.

భారీగా పెరిగిన ప్రయాణికులు

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చిన తర్వాత కరీంనగర్ రీజియన్‌లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులు నిండుగా వెళుతున్నాయి. పరిమితికి మించి ప్రయాణికులు వెళ్తున్న సందర్భాలు ఉన్నాయి. మహాలక్ష్మి పథకం అమల్లోకి రాకముందు కరీంనగర్ పూర్వ జిల్లాలో 11 డిపోల పరిధిలో రోజుకు 2.50 లక్షల మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ప్రయాణించేవారు. డిసెంబరు 9 నుంచి పథకం అమలు ప్రారంభమయ్యాక ప్రయాణికుల సంఖ్య 4 లక్షలకు పైగా చేరింది. ఇందులో 2.50 లక్షల మంది మహిళలే ఉండటం విశేషం.

సమస్యల పరిష్కారం కోరుతూ..

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అద్దె బస్సుల యజమానులు ఈ నెల 5 నుంచి సమ్మెబాట పడుతున్నారు. అదే జరిగితే బస్సులు లేక ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది. అద్దె బస్సులన్నీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులే కావడం గమనార్హం. దీంతో ప్రభుత్వానికి తలనొప్పిగా మారే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. ఇప్పటికే సమ్మె విషయంపై ఆర్ఎంతోపాటు డిపోల వారీగా డీఎంలకు సమ్మె నోటీసు అందజేసినట్లు అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ఛ

డిమాండ్లు ఇవీ..

మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రయాణికుల సంఖ్య పెరిగింది. నిర్వహణ భారం కూడా పెరిగి పోయింది. ఈ నేపథ్యంలో బస్సుల అద్దెను పెంచాలి.

పరిమితికి మించి లోడ్ ఉన్నపుడు టైర్లు వేడి అయి పేలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కొత్త టైర్లు బల్క్ రేట్లకు ఇవ్వాలి.

బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కుతున్నారు. సీటింగ్ సామర్థ్యానికి మాత్రమే బీమా చెల్లిస్తాం. ప్రమాదాలు జరిగినప్పుడు సీటింగ్ పరిమితికి మించి ఉంటే క్లెయిమ్‌కు ఇబ్బందిగా మారుతుంది. దీనిపై స్పష్టంగా ఉత్తర్వులు ఇవ్వాలి.

బస్సుల్లో ప్రయాణికులు పెరగడంతో కేఎంపీఎల్‌పై తీవ్ర ప్రభావం పడుతుంది. ప్రస్తుత కేఎంపీఎల్ (బస్సులను బట్టి కిలో మీటరుకు)తో నడపడం సాధ్యం కాదు. కేఎంపీఎల్‌ను తగ్గించాలి.

సమస్యలు పరిష్కరించాలిబస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య భారీగా పెరిగింది. దీంతో బస్సులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నిర్వహణ భారం, ఖర్చులు పెరిగి పోయాయి. డిమాండ్ల సాధన కోసం సమ్మెకు దిగుతున్నాం. ఇప్పటికే ఆర్ఎంకు సమ్మె నోటీసు ఇచ్చాం. – మల్లారెడ్డి, అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం

# డిజిటల్ కీ ఉన్నా ఆగని అక్రమాలు!

కరీంనగర్: ఏడాది కిందట కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండల కేంద్రంలోని ఓ ఎకరం భూమికి సంబంధించి పట్టాదారుల పేర్లు క్షణాల వ్యవధిలో మారిపోయాయి. ఏకంగా అప్పటి జిల్లా పాలనాధికారి డిజిటల్‌కీని ఉపయోగించి ఇంటి దొంగలే ఈ అక్రమానికి పాల్పడ్డారు. అనుమానం వచ్చి కలెక్టరు ఆరా తీయడంతో అసలు మోసం బయట పడింది. రూ.కోట్ల విలువైన భూమి పరుల పరమైన తీరుని తెలుసుకుని జిల్లా ఉన్నతాధికారి అవాక్కయ్యారు. ఇలా ఎన్ని తప్పిదాలు జరిగాయనే ఉద్దేశంతో విచారణకు ఆదేశించారు. కలెక్టరు నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసి బాధ్యులపై చర్యల్ని తీసుకోవాలని కోరారు. విచారణ తరువాత ధరణి విభాగంలో పనిచేసిన ఇద్దరు పొరుగు సేవల సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. తరువాత ఇందులో ప్రమేయముందని భావించిన కొందరు ప్రభుత్వ ఉద్యోగులపై బదిలీ వేటు వేశారు.కుటుంబ సభ్యుల ధ్రువీకరణ జారీ విషయంలో వీణవంక డిప్యూటీ తహసీల్దార్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి డిజిటల్ కీ ని దుర్వినియోగపర్చారని అక్కడి తహసీల్దార్ జిల్లా కలెక్టరుకు, పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. తాను తిరస్కరించిన దరఖాస్తును తాను సెలవులో ఉన్నప్పుడు తన డిజిటల్ కీ ద్వారా పత్రాన్ని జారీ చేసిన విషయమై వివరాలతో ఉన్నతాధికారికి నివేదిక అందించారు. గత నెల 4వ తేదీన తహసీల్దార్ విధుల్లో లేని సమయంలో డిప్యూటీ తహసీల్దార్ ఆన్‌లైన్‌లో పత్రాన్ని జారీ చేసేందుకు డిజిటల్ కీని ఉపయోగించారని కేసు నమోదైంది.

డిజిటల్ సంతకాల తాళం చెవి(కీ) అక్రమాలకు ఆజ్యం పోస్తోంది. కొందరి స్వార్థపూరిత ప్రయోజనాలకు ఉపయుక్తంగా మారుతోంది. పారదర్శకతకు ఉపయోగపడాల్సిన విలువైన సంతకం కొన్నిసార్లు అక్రమార్కులకు వరంగా మారుతోంది. కాసుల కక్కుర్తితో కొందరు దొడ్డిదారిన పత్రాల జారీ విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటం ఇబ్బందిని పెంచుతోంది. ముఖ్యంగా భూముల అక్రమాలకు, ఇతరుల పేరిట మార్పిడులకు ఈ రూపంలో అధికారం దుర్వినియోగమవుతోంది.

పర్యవేక్షణ లేక ఇబ్బంది..

సురక్షితమైన, చట్టబద్ధమైన ఈ సంతకం విషయంలో నాలుగు జిల్లాల పరిధిలో పర్యవేక్షణ లోపం శాపంగా మారుతోంది. డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్ లేదా డిజిటల్ సంతకంగా పిలిచే దీని వల్ల వేగంగా సురక్షితంగా ఉన్నతాధికారి సంతకం చేసి ఎక్కువగా పత్రాలను జారీ చేసే అవకాశం ఉంటుంది. భూమి పట్టాలతోపాటు కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలను అందించే అధికారం ఉంటుంది. సంతకం చేసిన తరువాత ఆన్‌లైన్‌లో ఆ అధికారి గుర్తింపు నమోదవుతుంది. ఈ కీ కచ్చితంగా సంబంధిత అధికారులే వినియోగించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ కింది స్థాయి సిబ్బందికి ఇవ్వొద్దని స్పష్టం చేయాలి. అంతర్జాల వ్యవహారంతో ముడిపడిన ఈ 'కీ' వినియోగం విషయంలో తప్పిదాలుంటే ఐటీ చట్టం ప్రకారం బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చు. అయితే గతంలో తప్పిదాలకు పాల్పడిన వారి విషయంలో ఎలాంటి కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో కింది స్థాయి అధికారులు.. సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.. ఇప్పటికైనా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టి అక్రమాలకు చోటు లేకుండా చూడాల్సిన అవసరం ఉంది.

భూ దందాల్లో అధికంగా..

రెవెన్యూ శాఖలో జిల్లా పాలనాధికారితోపాటు అన్ని మండలాల తహసీల్దార్లకు డిజిటల్ సంతకాన్ని ఇచ్చారు. సంప్రదాయ చేతి సంతకంతో పోలిస్తే ఈ డిజిటల్ సంతకం ఎక్కువ భద్రత ఉంటుందనే ఉద్దేశంతో దీన్ని పాలనాపరమైన అంశాల్లో కీలకంగా మార్చారు. ఒక అధికారి సంతకాన్ని సులువుగా ఫోర్జరీ చేసే విధానానికి స్వస్తి పలకాలన్న ఉద్దేశంతో దీన్ని అమలు చేస్తున్నారు. రెవెన్యూ శాఖ నుంచి పౌరులకు అందించే పలు రకాల పత్రాలకు ఇది తప్పనిసరి. ఉన్నతాధికారుల వద్ద ఉండాల్సిన ఇది కొన్ని సందర్భాల్లో కింది స్థాయి సిబ్బంది చేతికి చేరుతోంది. సంబంధిత అధికారి తప్ప.. మిగతావారెవరూ దీన్ని వినియోగించే అధికారం ఉండదు. కాని ఇతర పనుల ఒత్తిడి.. కింది స్థాయి సిబ్బందిపై ఉన్న నమ్మకంతో కొందరు అధికారులు పాస్‌వర్డ్లు ఆపరేటర్లకు చెబుతున్నారు. ఇదే అదనుగా లోలోపల పలు అక్రమాలు జరుగుతున్నాయి. చాలాచోట్ల తహసీల్దార్లకు తెలియకుండా కింది స్థాయి సిబ్బంది భూ మార్పిడి విషయంలో పావులు కదుపుతున్న సందర్భాలుంటున్నాయి. ఇటీవల మూడు నాలుగు రోజుల కిందట జగిత్యాల అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలోనూ కుటుంబ ధ్రువీకరణ పత్రం జారీ విషయంలోనూ కొందరు సిబ్బంది తప్పు చేశారని తహసీల్దార్ గుర్తించారు. తీరా తేరుకుని ఫిర్యాదు చేయడంతోపాటు ధ్రువీకరణను జారీ చేయకుండా నిలిపివేశారు. చాలా తప్పిదాలు బయటకు రాకుండా సిబ్బంది జాగ్రత్త వహిస్తున్నారు. అక్కడక్కడా వెలుగులోకి వస్తున్నా శాఖ పరువు పోతుందనే ఉద్దేశంతో లోలోన తప్పుని సవరించుకుంటున్నారు.

# ఇందిరమ్మ భూములపై వివాదం

హైదరాబాద్ : నగర శివారులోని కీసర గ్రామంలోని దళితులకు మాజీ ప్రధాన మంత్రి 43 ఏళ్ల క్రితం ఇచ్చిన 94 ఎకరాల భూముల వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. అప్పట్లో రూ.లక్షల విలువ లేని ఇక్కడి స్థలం.. ప్రస్తుతం ఎకరానికి రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు పలుకుతుండడంతో లబ్ధిదారులు, స్థిరాస్తి సంస్థ ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు ఎవరికి వారు వాదనలు వినిపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ధరణి పోర్టల్‌లో రికార్డులు మార్చి ఓ స్థిరాస్తి సంస్థకు కట్టబెట్టారంటూ ఎస్సీ కుటుంబాలు ఆందోళన చేస్తుండగా.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు వారికి మద్దతుగా నిలవడం..రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి విచారణ చేయించాలంటూ డిమాండ్ చేయడంతో మేడ్చల్ జిల్లా రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలిస్తున్నారు. ఐదేళ్ల క్రితం అప్పటి కీసర రెవెన్యూ అధికారులు ధరణి రికార్డులను మార్చి ఓ స్థిరాస్తి సంస్థ ప్రతినిధుల పేరిట రిజిస్టర్ అయ్యేలా చేశారు. విషయం తెలుసుకున్న లబ్ధిదారుల్లో కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారు.

నివేదికపై మీనమేషాలు.. ఎస్సీలకు కేటాయించిన భూముల వివరాల్లో కొన్ని రికార్డుల్లో లేకపోవడం.. ధరణిలోనూ ప్రైవేటు వ్యక్తుల వివరాలుండడంతో హెచ్ఎండీఏ అనుమతితో నాలుగేళ్ల క్రితం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. ఇది తెలుసుకున్న దళిత కుటుంబాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. విచారణ పూర్తయ్యేంత వరకు యథాస్థితిని కొనసాగించాలంటూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో హెచ్ఎండీఏ అధికారులు ఈ స్థలాలపై సమగ్ర విచారణ నివేదిక ఇవ్వాలంటూ కీసర తహసీల్దార్, కీసర ఆర్డీవో, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్‌కు నాలుగేళ్ల క్రితం లేఖలు రాశారు. ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు విచారణ నివేదికను హెచ్ఎండీఏ అధికారులకు అందించలేదు.

# స్వచ్ఛత వైపు.. బోధన మెరుగు..!

కొత్తగూడెం : స్వచ్ఛ పాఠశాల లక్ష్యం సాకారం కావాలని సర్కారు భావిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల పరిశుభ్రతకు స్వచ్ఛ కార్మికులను, ఉపాధ్యాయుల కొరత ఉన్న విద్యాలయాల్లో విద్యా వాలంటీర్లను నియమించాలని యోచిస్తోంది. ప్రస్తుతం సర్కారు బడుల్లో అటెండర్లు, స్వీపర్లు లేకపోవడంతో మూత్రశాలలు, మరుగుదొడ్లు, తరగతి గదులను శుభ్రపరచటం, హరితహారంలో నాటిన మొక్కలకు నీరు పోయటం భారంగా మారుతోంది. పలుమార్లు ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు ఉపాధ్యాయులు నివేదించారు. కొవిడ్ సమయంలో స్వచ్ఛ కార్మికులతో పాటు విద్యా వాలంటీర్లను ప్రభుత్వం తొలగించింది. తాజాగా విద్యాశాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్కావెంజర్లు, విద్యా వాలంటీర్ల నియామక అంశం ప్రస్తావనకు వచ్చింది. తిరిగి వారిని మళ్లీ నియమించుకుంటే ప్రభుత్వ విద్యాలయాలకు మహర్దశ పట్టనుంది.

బోధనకు ఆటంకాలు కలగకుండా..

ఉపాధ్యాయుల కొరత ఉన్నచోట్ల గత ప్రభుత్వాలు విద్యా వాలంటీర్లను నియమించి బోధనకు ఆటంకాలు కలగకుండా చూశాయి. కొవిడ్ సమయంలో వీరిని అప్పటి సర్కారు తొలగించింది. తద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ప్రభావం పడింది. చాలామంది విద్యార్థులు



కనీసం కూడికలు, తీసివేతలు చేయలేకపోతున్నారని, బోర్డుపై సరిగ్గా పేర్లు రాయలేకపోతున్నారని వివిధ సర్వేల్లో వెల్లడైంది. తాజాగా విద్యా వాలంటీర్ల నియామకం తెరపైకి రావటంతో వందలాది పాఠశాలల్లో చదివే విద్యార్థులకు లబ్ధి కలగనుంది. ఒక్కో విద్యా వాలంటీర్‌కు నెలకు రూ.12వేల చొప్పున వేతనం అందనుంది. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను నియమించే వరకు విద్యా వాలంటీర్ల సేవలు వినియోగించుకునేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది.

పాత పద్ధతిలో నియామకం..!

సర్వ శిక్ష ఆధ్వర్యంలో స్కావెంజర్లను పాత పద్ధతిలో నియమించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు వేర్వేరుగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పది నెలల పాటు వేతనం అందించనున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ, చెట్ల పెంపకానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని భావిస్తున్నారు. స్కావెంజర్లు (స్వీపర్లు, అటెండర్లు)ను నియమించుకుంటే పాఠశాల ఆవరణ, గదులు, మూత్రశాలలు శుభ్రపరచటం, మొక్కలకు నీళ్లు పట్టడం, తాగునీటి ఏర్పాట్లు తదితరాలను వారితో చేయించుకునే వెసులుబాటు లభిస్తుంది. ప్రస్తుతం వీరి స్థానంలో గ్రామీణ స్థాయిలో పంచాయతీ, పట్టణాల్లో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అరకొరగా విధులు నిర్వర్తిస్తున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలల పరిశుభ్రత ఉపాధ్యాయులకు తలకు మించిన భారంగా పరిణమిస్తోంది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ తాజా ఆలోచన కార్యరూపం దాల్చితే వేలాది పాఠశాలల్లో స్వచ్ఛత కనిపించనుంది.

ఖమ్మం భద్రాద్రి
ప్రాథమికోన్నత 192 162
ప్రాథమిక పాఠశాలలు 811 1,049
ఉన్నత 227 131
2019–20 విద్యాసంవత్సరంలో విద్యా వాలంటీర్లు 676 574

స్కావెంజర్లు, విద్యా వాలంటీర్లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తుండటం ఆహ్వానించదగిన పరిణామం. ప్రస్తుతం మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఇతర పనులకు స్వీపర్లు, అటెండర్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అందుబాటులో ఉన్న పారిశుద్ధ్య కార్మికులు ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో పనులు చేయలేకపోతున్నారు. మళ్లీ పాత పద్ధతిలో విద్యా వాలంటీర్లు, స్కావెంజర్లను నియమిస్తే ప్రయోజనం చేకూరుతుంది. వెంకటేశ్వరాచారి, డీఈఓ భద్రాద్రి

# అత్యాశకు పోవద్దు.. ఆగం కావొద్దు

మంచిర్యాల : దురాశ దుఃఖానికి చేటు అని పెద్దలు ఊరికే అనలేదు. ఈ రోజుల్లో ఒకరిని మోసం చేసేవాడు తెలివివంతుడైతే.. మోసపోవడం అత్యాశకు పోయేవారి వంతవుతోంది. కష్టపడి సంపాదించుకున్న సొమ్మును భూములు, ఇతరాత్ర వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టాలనుకున్న వారే తమ అస్త్రంగా వాడుతున్నవారు ఎందరో. జిల్లాలో వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలు కోకొల్లలు. కొందరు ఉద్యోగాల ఎరతో నిరుద్యోగులను మోసం చేస్తుండగా.. బంగారం దుకాణాల్లో స్కీంలు, చిట్టీల పేరుతో ఖాతాదారులను మోసం చేసి ఉడాయిస్తున్న ఘటనలు లేకపోలేవు.

చిన్న వయసు.. మంచి కుటుంబం.. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదన.. అతడిని చూసిన ప్రతి ఒక్కరికి కాస్తా అసూయ పుట్టేలా వ్యవహరించాడు. హైదరాబాద్‌లో పెద్ద సంస్థ.. రూ. కోట్లలో లావాదేవీలు.. డబ్బులు అరువిస్తే ప్రతి నెల 5 నుంచి 10 శాతం వడ్డీ ఇస్తున్నాడు. ఎంత కష్టపడ్డా ఇంత సంపాదన రాదని భావించిన వారంతా అతడికి అడిగినంత డబ్బు అందించారు. కొద్దిరోజులు సజావుగా సాగిన వీరి లావాదేవీలు ఒక్కసారిగా ఆగిపోయాయి. ఇంకేముంది తాము నమ్మితే తమ గొంతును తడిగుడ్డతో కోసినట్లుగా మోసం చేశాడని జిల్లాలోని పలువురు పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరుగుతున్నారు. ఇదీ ఇటీవల జైపూర్ మండలంలో చోటుచేసుకున్న ఘటన..'వారంతా విద్యావంతులు.. ప్రతి రూపాయిని ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేస్తారు. కాని ఇలాంటి ఉపాధ్యాయులను బురిడికొట్టించినవారు లేకపోలేదు. అత్యాశకు పోతే ఉన్న డబ్బులు పోతాయనడానికి ఈ ఘటనే ఓ ఉదాహరణ. ఆలేరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి స్థిరాస్తి వ్యాపారంలో పెట్టుబడులు పెడితే ఒక ఫ్లాట్‌తో పాటు నెలవారీ వడ్డీ 8 శాతం చెల్లిస్తామంటూ నమ్మబలికాడు. కొంతమంది ఉపాధ్యాయులను మచ్చిక చేసుకున్న నిందితుడు అనతికాలంలోనే రూ. కోట్లు వసూలుచేసి మోసాలకు పాల్పడ్డాడు.'

'మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉజ్వల సంస్థను స్థాపించిన కొందరు కొద్దిరోజుల్లోనే వారి వ్యాపారాన్ని ఇతర ప్రాంతాలకు విస్తరించారు. రెండు వేల మందిని ఖాతాదారులుగా చేర్చుకొని వారి నుంచి రూ. కోట్లు వసూలు చేశారు. ఇటీవల వారికి డబ్బులు తిరిగి చెల్లించకుండా బోర్డు తిప్పేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై వేములవాడ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

# ఓరుగల్లు.. సాగునీటి వనరుల ఖిల్లా!



జయశంకర్ : ఎనిమిది శతాబ్దాల క్రితమే సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు కాకతీయులు గొలుసుకట్టు చెరువులు నిర్మించారు. నేటికీ ఉమ్మడి జిల్లాలో ప్రధాన వనరు కాకతీయుల చెరువులే. రామప్ప, లక్నవరం, గణపసముద్రం, తదితర చెరువులు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 8 వేలకు పైగా చెరువులున్నాయి. మిషన్ కాకతీయ పథకంతో 2 వేల చెరువుల్లో పూడిక తీసి పునరుద్ధరించారు. దీంతో సాగునీటి సమస్య పరిష్కారమైంది. నియోజకవర్గానికో చెరువును మినీ ట్యాంక్ బండ్‌లా నిర్మించి ఆహ్లాదభరితంగా రూపొందించారు.

దేవాదులకు అనుసంధానంగా..

మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు దేవాదుల. ఏడు లక్షల ఎకరాల సాగునీరు లక్ష్యంగా నిర్మించిన దేవాదుల ఉమ్మడి వరంగల్ జిల్లాకు సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తోంది. రాష్ట్రం ఏర్పడ్డాక మూడో దశ పనులు వేగవంతం అయ్యాయి. దేవాదుల నుంచి ఏడాదికి 70 టీఎంసీలను ఎత్తిపోసేందుకు దేవాదులకు అనుసంధానంగా నిర్మించిన సమ్మక్కసాగరం(తుపాకులగూడెం) అందుబాటులోకి వచ్చింది. వేసవిలోనూ ఎత్తిపోస్తున్నారు.

కాళేశ్వరంతో జీవనదిగా గోదావరి

వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే గోదావరిలో నీరుండేది. వేసవి కాలంలో గోదావరి నీటిధారలు కూడా కనిపించేవి కావు. నేడు కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎల్లంపల్లి నుంచి మేడిగడ్డ వరకు గోదావరిలో జలకళ ఉట్టిపడుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలతో పాటు, కాళేశ్వరం పంప్‌హౌస్ నిర్మించారు. 45 లక్షల ఎకరాల సాగునీటి లక్ష్యంతో నిర్మించిన ప్రాజెక్టు ఈ ఏడాది 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందించినట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి వరంగల్‌కు మధ్యమానేరు, ఎల్ఎండీ నుంచి ఎస్సారెస్పీ డీబీఎం ద్వారా సాగునీరు అందుతోంది. గతంలో వర్షాకాలంలోనే ఎస్సారెస్పీ నుంచి సాగునీరు వచ్చేది. నేడు రెండు పంటలకు చివరన ఉన్న నర్సంపేట, ములుగు, భూపాలపల్లి, నియోజకవర్గాలకు కూడా సరఫరా అవుతోంది.

ఇది గొప్ప ప్రాజెక్టు

ఎన్. వెంకటేశ్వర్లు, ఈఎన్‌సీ రామగుండం

కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రానికి ఎంతో మేలు కలుగుతోంది. వెనక్కు ఎత్తిపోతలనేది ప్రపంచంలోనే ఎక్కడా లేదు. సీఎం కేసీఆర్ ఆలోచనతో ఇది సాధ్యమైంది. దీంతో రాష్ట్రానికి 70 శాతం వరకు నీటి అవసరాలు తీరుతాయి. గోదావరిపై బ్యారేజీల నిర్మాణంతో నదికి జీవకళ వచ్చింది. 6 నుంచి ఏడున్నర మీటర్ల వరకు భూగర్భ జలాలు పెరిగాయి. గతంలో ఎస్సారెస్పీ నీటి ద్వారా ఒక పంటే సాగుచేసేవారు. కాళేశ్వరం నీటితో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, తదితర ప్రాంతాల్లో రెండు పంటలు పండిస్తున్నారు. వరి సాగు రెండున్నర రెట్లు పెరిగింది.

# నాయకత్వ లక్షణాలపై ఆన్‌లైన్ శిక్షణ

డోర్నకల్ : వేసవి సెలవులు ముగిసి మరో వారం రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. జిల్లాలో ఇప్పటికే బడిబాటకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం పాఠశాల నిర్వహణ అంశంపై ఒక ఆన్‌లైన్ కోర్సును అందుబాటులోకి తీసుకొచ్చింది. మార్పుతో కూడిన బోధన, ఉపాధ్యాయుల భాగస్వామ్యం పెంచడం, సూక్ష్మ దృష్టి లక్ష్యంగా ఎంహెచ్‌ఆర్‌డీ (కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ) ఆధ్వర్యంలో జాతీయ విద్యా ప్రణాళిక, పరిపాలన (న్యూపా) ఈ ఆన్‌లైన్ కోర్సు నిర్వహణకు సంకల్పించింది. జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, గురుకులాలతో పాటు జూనియర్ కళాశాలల ప్రధానోపాధ్యాయులు, పిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు యూడైస్ కోడ్‌తో పేర్లు నమోదు చేసుకుని శిక్షణలో భాగస్వామ్యమయ్యే వీలు కల్పించారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకే..

కొవిడ్–19 తర్వాత జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల ప్రవేశాల నమోదు పెరిగింది. వివిధ రకాల ఉచిత పథకాల అమలుకు తోడు




'మన ఊరు–మన బడి' కింద ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వం వసతులు కల్పిస్తున్న సంగతి తెలిసిందే. జిల్లాలోని 1025 బడుల్లో లక్ష మందికి పైగా విద్యార్థులుండగా వీరికి బోధించడానికి సుమారు 5 వేల మంది ఉపాధ్యాయులున్నారు. పాఠశాలల్లో నాణ్యత ప్రమాణాలు, ఉత్తమ ఫలితాల సాధన ఆశించిన మేరకు ఉండటం లేదు. దీనిని పసిగట్టిన కేంద్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు నాయకత్వం, సమర్థ నిర్వహణ, అభివృద్ధి అనే అంశాలపై ఆన్‌లైన్ కోర్సు ప్రారంభించింది. ఇందులో బడుల నాయకత్వ దృక్పథం, స్వీయ అభివృద్ధి, బోధన అభ్యసన ప్రక్రియను మార్చడం, బిల్డింగ్, లీడింగ్ బృందాల సృష్టి, ప్రముఖుల ఆవిష్కరణలు, ప్రముఖుల భాగస్వామ్యాల పాఠశాల పరిపాలన, బడి అభివృద్ధి ప్రణాళికను ఏకీకృతం చేయడం వంటి అంశాలపై శిక్షణ ఉంటుంది. వీటిని ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటే వారిలో ప్రమాణాలు పెరుగుతాయనేది కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. విజయవంతంగా శిక్షణ పూర్తిచేస్తే ఆన్‌లైన్ ధ్రువపత్రం అందుతుంది.

వెబ్‌సైట్ ఇదీ

శిక్షణ కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీఎస్ఎల్ఎం.ఎన్ఐఈపీఏ.ఏసీ.ఐఎన్ అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పేరు, వివరాలు, మెయిల్ ఐడీ, ఉద్యోగి సంఖ్య, చిరునామా తదితర వివరాలు నమోదు చేసుకోవాలి. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ సిద్ధం చేయాలి. కోర్సు ప్రారంభమైన రోజు నుంచి వెబ్‌సైట్‌లో స్టడీ మెటీరియల్‌తో సబ్జెక్టులను చదువుకోవాలి. ఆ తర్వాత ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియ మొదలైంది.

# వ్యవసాయానికి రుణ ప్రాధాన్యం

కరీంనగర్ : వ్యవసాయ రంగంతో పాటు పారిశ్రామిక, మహిళా సంఘాలు, ఇతర రంగాలకు ప్రాధాన్యమిచ్చి జిల్లా వార్షిక రుణ ప్రణాళిక అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. 2023–24 వార్షిక రుణ ప్రణాళికను నెల రోజుల కిందట నిర్వహించిన సమావేశంలో ఆవిష్కరించి ఆమోదం తెలిపారు. గతేడాది రుణ ప్రణాళిక అమలు లక్ష్యాన్ని మించడంతో దానికి అనుగుణంగానే ఈ సంవత్సరం ప్రణాళిక రూపొందించారు. ఈసారి కూడా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు అధిక ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు. అధిగమించిన గతేడాది లక్ష్యం

2022–23 సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళిక రూ.4749.14 కోట్లు కాగా రూ.8772.48 కోట్ల రుణాలు ఇచ్చి లక్ష్యాన్ని అధిగమించారు. వందశాతం లక్ష్యం కాగా 184.72 శాతం సాధించారు. అన్ని రకాల పంట రుణాలు కలిపి రూ.3317.40 కోట్లకుగాను రూ.3697.24 కోట్లు పంపిణీ చేసి 111.45 శాతం మేర చేశారు. పంట రుణాలు 79.4 శాతం సాధించగా వ్యవసాయ టర్మ్ రుణాలు మాత్రం 173.93 శాతం సాధించారు. అన్ని రకాల రుణాల్లో వంద శాతం దాటినట్లు అధికారులు తెలిపారు.

36 బ్యాంకులు.. 216 శాఖలు

జిల్లాలో 36 బ్యాంకుల పరిధిలో 216 శాఖలు సేవలందిస్తున్నాయి. ఈసారి రుణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం రాయితీ రుణాలు మంజూరు చేసి నిరుద్యోగులకు తోడుగా ఉండాలని భావిస్తున్నప్పటికీ కొన్ని బ్యాంకులు నిరుద్యోగులను రుణ మంజూరుకు పలు రకాల కాగితాలు తీసుకుంటున్నట్లు వాపోతున్నారు. బ్యాంకు రుణాల్లో జాప్యం జరుగుతుంది. ప్రభుత్వ పథకాలకు షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలని కోరుతున్నారు.

పంట పరిహారం, రుణ రికవరీ చేయొద్దు

ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం డబ్బు రైతు ఖాతాలో జమ చేస్తే ఆ డబ్బును పంట రుణం కింద రికవరీ చేయొద్దని కలెక్టర్ ఆర్.వి.కర్ణన్ బ్యాంకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వ్యవసాయం, పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

రూ.7481.96 కోట్లతో వార్షిక ప్రణాళిక

జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.7481.96 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు. ఈ రుణాలను ఆయా రంగాల వారీగా వచ్చే ఏడాది మార్చి 31 వరకు పూర్తి చేయాలి.

వ్యవసాయ రంగానికి అన్ని రుణాలు కలిపి 2,42,745 మంది రైతు ఖాతాదారులకు రూ.3579.37 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు.

సూక్ష్మ, మధ్యతర రంగాల పరిశ్రమలకు 22,010 మందికి రూ.1063.70 కోట్ల రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని ప్రణాళికలో కేటాయించారు.

విద్యా రుణాల కింద 827 మందికి, గృహ నిర్మాణాలకు 1772 నిర్మాణదారులకు, సామాజిక, మౌలిక సదుపాయాలకు 445 మందికి, ప్రాధాన్యం, ప్రాధాన్యేతర విభాగానికి మొత్తం కలిపి 48,134 మందికి రూ.2595.04 కోట్ల రుణాలు ఇవ్వనున్నారు. మొత్తం మీద 3,16,471 మంది ఖాతాదారులకు రూ.7481.96 కోట్ల రుణ ప్రణాళికను నిర్ణీత గడువులోగా పూర్తి చేయనున్నారు.

మళ్లీ లక్ష్యాన్ని సాధిస్తాంగతంలో మాదిరిగానే మళ్లీ లక్ష్యాన్ని అధిగమిస్తాం. పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న వారికి, నిరుద్యోగులకు ఇబ్బందులు లేకుండా రుణాలు ఇచ్చేలా చూస్తాం. వ్యవసాయ రంగానికి ప్రధాన ప్రాధాన్యం ఉంటుంది. ఆంజనేయులు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్

# మార్కెట్‌లో గాడి తప్పిన పాలన



వరంగల్ : ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పాలన గాడి తప్పుతోంది. మార్కెట్‌లో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలపై గొంతు విప్పే వారే కరవయ్యారు. రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు.. క్రయవిక్రయాల్లో వారికి ఎదురయ్యే సమస్యలు, వారి అవసరాలపై అధికారులను, వ్యాపారులను నిలదీసేందుకు ఏర్పాటైన పాలకవర్గం ఆ వైపు దృష్టి సారించడం లేదు. మరోవైపు అభివృద్ధి పనుల జాప్యంతో మార్కెట్ అధికారులకు తిప్పలు తప్పడంలేదు.

రైతాంగ సమస్యలపై గొంతువిప్పని పాలకవర్గం..

ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్‌తో పాటు ఎనిమిది మంది సభ్యులు, నలుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులతో ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంలో కేవలం ఇద్దరు మాత్రమే వ్యవసాయానుభవం ఉన్నవారు. మిగిలినవారందరూ.. వ్యాపారులు, రాజకీయ నాయకులే. పాలకవర్గం నియామకంలో పూర్తిస్థాయిలో రాజకీయ ప్రమేయం ఉండడంతో.. రైతుల సమస్యలు ఎరిగిన వారిని పాలకవర్గ సభ్యులుగా నియమించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండేళ్ల నుంచి మార్కెట్ అభివృద్ధి కోసం పాలకవర్గం నిర్వహించిన సమీక్ష సమావేశాల సంఖ్యను వేళ్లపై లెక్కించవచ్చు. గతేడాది జూన్‌లో మార్కెట్‌లో అభివృద్ధి పనులు, మరమ్మతులకు మార్కెటింగ్ శాఖ మంజూరు చేసిన రూ.2.02 కోట్లతో చేపట్టిన పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడం పాలకవర్గం పనితీరుకు అద్దంపడుతుంది. రైతులకు, వ్యాపారులకు, అధికారులకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరించాల్సిన పాలకవర్గం రైతుల సమస్యలపై అధికారులను, వ్యాపారులను నిలదీసిన ఘటనలు మచ్చుకు కానరావు. మార్కెట్ కమిటీకి అధికారికంగా ఆమె ఛైర్‌పర్సన్‌గా ఉన్నా.. పెత్తనమంతా ఆమె భర్తదే నడుస్తుందన్న విమర్శలున్నాయి. మార్కెట్‌కు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా.. అభివృద్ధి పనులకు సంబంధించి గుత్తేదారులకు బిల్లుల చెల్లింపులు.. తదితర దస్త్రాలపై ఛైర్‌పర్సన్ సంతకం చేయాలన్నా.. మార్కెట్ అభివృద్ధికి సంబంధించి అత్యవసరమైన నిర్ణయం తీసుకోవాలన్నా.. ఆయనతో చర్చించిన తర్వాతే అని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

పాలకవర్గం వైఫల్యానికి నిదర్శనమీ ఘటనలు..

గతేడాది జనవరి 24న వ్యాపారులు మిర్చి ధరలను అమాంతం తగ్గించడంతో భగ్గుమన్న రైతులు ఆందోళనకు దిగారు. పరిపాలన భవనం ముందు గంటలపాటు నిరసన తెలపడంతో పాటు కాంటాలు, వాహనాలను ధ్వంసం చేశారు. రైతుల తరఫున నిలబడేందుకు, వారికి మద్దతు ధర కల్పించేందుకు పాలకవర్గం వెనకాడింది. అప్పటి జిల్లా కలెక్టర్ సూచనలతో మార్కెట్ అధికారులే రైతులకు భరోసా కల్పించి.. వ్యాపారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషిచేశారు. ఈ ఏడాది మార్చిలో అంతర్రాష్ట్ర మార్కెట్‌ల పరిశీలన కోసం నాగ్‌పూర్, నిజామాబాద్ మార్కెట్‌లను పాలకవర్గ సభ్యులు సందర్శించారు. ఖర్చుల నిమిత్తం మార్కెట్ కమిటీ రూ.లక్ష సమకూర్చింది. రెండు నెలలు గడిచినా.. ఆ మార్కెట్‌లలో పరిశీలించిన అంశాలు, ఇక్కడ మార్కెట్‌లో అనుసరించాల్సిన, అమలుచేయాల్సిన విధివిధానాలపై పాలకవర్గం ఇప్పటివరకు సమీక్షలు నిర్వహించిన దాఖలాలులేవు.

ఈ ఏడాది మార్చి 23న ఎనుమాముల మార్కెట్‌లో అకస్మాత్తుగా అకాల వర్షం కురవడంతో.. సుమారు 10వేలకు పైగా బస్తాలు వర్షపునీటిలో తడిసిపోయాయి. అదే అదనుగా బస్తాకు 4 కిలోల చొప్పున తరుగు తీస్తామని వ్యాపారులు ప్రకటించడంతో.. రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు ఒప్పుకోకపోవడంతో.. వ్యాపారులు కొనుగోళ్లను నిలిపివేశారు. రైతులకు న్యాయం చేసేందుకు.. తడిసిన బస్తాలకు గిట్టుబాటు ధర కల్పనకు మార్కెట్ పాలకవర్గం వ్యాపారులతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదు. రైతులు తడిసిన పంట ఉత్పత్తులను తరుగు తీయకుండా కొనుగోలుచేయాలని డిమాండ్‌చేస్తూ.. మార్కెట్ ముందు ప్రధాన రహదారిపై సుమారు 4 గంటల పాటు బైఠాయించారు.

# పరిశ్రమలతోనే అభివృద్ధి

జగిత్యాల : పరిశ్రమలతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో పారిశ్రామిక ఉత్సవాన్ని నిర్వహించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ దావ వసంత, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్, అదనపు కలెక్టర్లు బీఎస్ లత, మంద మకరందు, ఆర్డీవోలు ఆర్.డి.మాధురి, టి.వినోద్‌కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధిలో పరిశ్రమల పాత్ర కీలకమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సింగిల్‌విండో విధానం అమలులోకి తెచ్చిందన్నారు. ప్రభుత్వ పరంగా పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తున్నామని ప్రతిఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కొత్త పరిశ్రమలకు శ్రీకారం చుట్టాలని కలెక్టర్ అన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల పారిశ్రామిక రంగం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళలు స్వయం ఉపాధి పథకాలతో అభివృద్ధి చెందుతున్నారని... మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదిగి మహిళలకు ఉపాధి చూపాలన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ... రాష్ట్ర మంత్రి కేటీఆర్ తీసుకుంటున్న చొరవతో పారిశ్రామికంగా రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా వివిధ మహిళా సంఘాలు చేసిన ఉత్పత్తులను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు.

ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ యాస్మిన్‌బాషా ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కార్యక్రమాల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో గత ఐదు రోజులుగా నిర్వహించిన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని 7న నియోజకవర్గ స్థాయిలో సాగునీటి దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండగ నిర్వహించాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో ప్రజలు చెరువుల వద్దకు బతుకమ్మలు, బోనాలతో ర్యాలీగా వెళ్లి కట్టమైసమ్మకు పూజలు చేసి అక్కడే భోజనం చేసేలా ఏర్పాటు చేయాలన్నారు. చెరువుల వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

# ఆహార కల్తీ.. రోగాలతో కుస్తీ

కరీంనగర్ : ఇటీవల ఇద్దరు మిత్రులు రెస్టారెంట్‌కు వెళ్లి చికెన్ కర్రీ, రొట్టెలు ఆర్డర్ చేశారు. కొద్దిసేపటి తర్వాత వెయిటర్ వాటిని తీసుకొచ్చాడు. అది తింటుంటే కుళ్లిన వాసన వచ్చింది. ఇదేంటని అడిగితే స్పందన లేదు. అధికారులకు ఫిర్యాదు చేద్దామంటే.. ఎవరికీ చెప్పాలో అవగాహన బోర్డులు లేవు. తిని రోగాలు తెచ్చుకోవడం కంటే తినకుండా బిల్లు కట్టిందే బెటర్ అని వచ్చేశారు. దాదాపు చాలా రెస్టారెంట్లలో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. తనిఖీలు లేకపోవడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీ సమయంలో కుళ్లిన ఆహార పదార్థాలు, లేబుల్ లేని తినుబండారాలు తయారు ప్రదేశాలను గుర్తించి తనిఖీ చేపట్టారు. కుళ్లిన ఆహార పదార్థాలతోపాటు తయారు చేసే ప్రదేశం అధ్వానంగా ఉండడం చూసి పోలీసులే నివ్వెరపోయారు. మారుతున్న జీవనశైలిలో భాగంగా తినే ఆహారంలో అనేక మార్పులొచ్చాయి. భుజించే ఆహారంలో కల్తీ పెరుగుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మహిళలు గర్భం దాల్చి.. సాధారణ ప్రసవం వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మూడు నుంచి నాలుగు కిలోల శిశువులకు జన్మనిచ్చేవారు. ప్రస్తుతం చాలామంది జంక్‌ఫుడ్, బయటి ఆహారం అధికంగా తీసుకుంటున్నారు. గర్భం దాల్చిన మొదటి నెల నుంచే కనీసం రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు క్యాల్షియం ఇతర మాత్రలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. రక్తం లేదని పలువురికి ఐరన్ ఇంజక్షన్లు కూడా రాస్తున్నారు.

అడ్డుకునే వారు లేరు..

చిన్న హోటల్ నుంచి మొదలుకొని రెస్టారెంట్ల వరకు ఆహారం కల్తీ జరుగుతుంది. వంటల్లో నాణ్యమైనా మంచినూనె వాడడం లేదు. కొన్నిసార్లు వాడిన నూనెను పదేపదే వాడడంతో విష పదార్థాలు తయారవుతున్నాయి. తాజా కూరగాయలతో వంటలు చేయకపోవడం, బిర్యానీల్లో ఆకర్షించేలా రంగులను వాడుతున్నారు. నూడుల్స్ రుచిగా ఉండేలా కొన్ని పదార్థాలు కలుపుతుంటారు. ప్రతి ఆహార పదార్థాల్లో కల్తీ చేసి విక్రయిస్తుంటారు. జాగ్రత్తగా గమనించి కొనుగోలు చేయాలి. క్షేత్ర స్థాయిలో నాసిరకం పదార్థాలు విక్రయిస్తున్నా.. పరిశీలించాల్సిన అధికారులు కానరావడంలేదు. నిబంధల ప్రకారం ప్రతి వస్తువుపై లేబుల్ ఉండాలి. తయారీ తేదీ, అందులో కలిపే వస్తువులు, గడువు వివరాలు ఉండాలి. మార్కెట్‌లో పలు రకాల అప్పాలు, పచ్చళ్లు, చిప్స్, కార, బొందీ, పాపుడాలు, అప్పడాలు, చిన్న పిల్లలు తినే పొట్లాలు అనుమతులు లేకుండానే తయారు చేస్తున్నారు.

ప్లాస్టిక్ కవర్లతో...క్యాన్సర్

ఇంట్లో వంట చేసుకోవడంలో ఇబ్బంది ఉన్నవారు సాధారణంగా కూరలు కొనుక్కొని ఇంటికి తీసుకెళ్తుంటారు. కర్రీపాయింట్ల వద్ద ప్లాస్టిక్ కవర్లలో వేడి కూరలు, సాంబార్ పార్సిల్ చేస్తుంటారు. ఇతర పనిప్రదేశాలలో, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు గరంగరం ఛాయ్‌ని కవర్‌లో తీసుకెళ్తుంటారు. ఇది చాలా ప్రమాదకరమని క్యాన్సర్ వచ్చే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కఠిన శిక్షలు..

పరిరక్షణలేని ఆహారాన్ని ఎవరు తయారు చేసినా, అమ్మినా, నిల్వ చేసినా, సరఫరా చేసినా ఫుడ్ సెఫ్టీ, స్టాండర్డ్ యాక్ట్ 2006 చట్టం ద్వారా శిక్షతోపాటు జరిమానా విధిస్తారు. అనుమతిలేకుండా విక్రయిస్తే ఆరు నెలల జైలు, రూ.లక్ష వరకు జరిమానా వేస్తారు. ఆరోగ్యానికి హానికరంగా ఉంటే ఏడాది జైలు శిక్ష, రూ.3 లక్షల వరకు జరిమానా ఉంటుంది. తీవ్ర అనారోగ్యానికి గురి చేసే ఆహార పదార్థమైతే ఆరు నెలల జైలు శిక్ష, రూ.5 లక్షల వరకు జరిమానా వేస్తారు. మృతికి కల్తీ ఆహారం కారణమైతే జీవిత ఖైదు, రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయి.

ఇన్‌ఛార్జులతో కొనసాగింపు..

జిల్లాల వారీగా ఆహార కల్తీ నిరోధక శాఖలను ఏర్పాటు చేశారు. జిల్లాకు ఒక గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఫుడ్ సేఫ్టీ అధికారిని నియమించారు. ఆధికారులు ఆహార భద్రత, పరిరక్షణ, ప్రమాణాలను పర్యవేక్షించాలి. వీరికి సహాయకులుగా జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు ఆఫీస్ సబార్డినేటర్లను నియమించారు. చాలా జిల్లాల్లో అధికారులు పదవీ విరమణ చేస్తున్నారు. వారి స్థానంలో కొత్త వారిని నియమించడం లేదు. ఇతర జిల్లాల అధికారులకు ఈ బాధ్యతలను అప్పగించారు. కరీంనగర్ గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టును నిజామాబాద్ అధికారికి ఇన్‌ఛార్జిగా, ఆహార భద్రత అధికారి పోస్టును సిరిసిల్ల అధికారికి ఇన్‌ఛార్జిగా అప్పగించారు. జిల్లా కార్యాలయంలో ఒక జూనియర్ అసిస్టెంట్, స్వీపరే విధులు నిర్వహిస్తున్నారు.

వ్యాధులకు మూలం

బయటి ఆహారం తినడంతో చాలా రోగాలు వచ్చే అవకాశముంది. వీలైనంత వరకు తగ్గించుకుంటే మంచిది. ప్రస్తుతం చాలామంది ఆర్డర్ పెట్టి ఫుడ్ ఇంటికి తెప్పించుకుంటున్నారు. వారు ప్రమాదకరమైన కవర్లలో ప్యాకింగ్ చేస్తున్నారు. మంచి నూనె వాడకపోవడం, వాడిన నూనెనే మళ్లీ వాడడంతో కడుపు నొప్పి వాంతులు, విరేచనాలు, బరువు పెరగడం, అజీర్ణం, బీపీ, మధుమేహం, శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గిపోవడం, కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయి. తర్వాత అది పచ్చకామెర్లకు దారి తీసి క్యాన్సర్ కూడా రావచ్చు. కవర్లలో టీ, కూరలు పార్సిల్ తీసుకుపోతుంటారు. ఇది అత్యంత ప్రమాదకరం. క్యాన్సర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి. జ్యోతి, ఆర్ఎంవో జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి

# సర్కారు వైద్యానికి జవసత్వాలు

పెద్దపల్లి : పేదలకు వైద్య సేవలు మరింత చేరువయ్యేందుకు జాతీయ ఆరోగ్య మిషన్ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక వైద్యశాలల్లో ఇప్పటి వరకు ఉన్న పారిశుధ్య, ఆసుపత్రి ఆరోగ్య కమిటీల స్థానంలో 'జన ఆరోగ్య సమితి' ఏర్పాటు తెరపైకి తీసుకొచ్చారు. వైద్య సేవల నిర్వహణకు అవసరమైన నిధుల కేటాయింపు పెంచారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వైద్యాశాఖ నూతన కమిటీల నియామక ప్రక్రియ పూర్తి చేసింది. కొత్తగా బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నారు. దీంతో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

కొత్త విధానం ఇలా..ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ విధానంతో వైద్య సేవలు మెరుగుకానున్నాయి. ఉప వైద్య కేంద్రాలకు గ్రామ స్థాయిలో సర్పంచి ఛైర్మన్, మండల స్థాయిలో ఎంపీపీ, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే జిల్లా ఆసుపత్రికి జడ్పీ ఛైర్మన్ జన ఆరోగ్య సమితికి ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ కమిటీలో వివిధ శాఖల అధికారులు, ఏఎన్ఎంలు, సెర్ప్ సిబ్బంది సభ్యులుగా కొనసాగనున్నారు. మొక్కుబడిగా సమావేశాలు కాకుండా ప్రతి నెలా మూడో శనివారం తప్పనిసరిగా సమావేశం ఏర్పాటు చేయాలి. సభ్యుల సమక్షంలో ఆసుపత్రి అభివృద్ధిపై చర్చించిన సమస్యలను తీర్మానించనున్నారు.



# పార్టీ ఏ బాధ్యత అప్పగించినా.. శక్తివంచన లేకుండా పనిచేస్తా

దిల్లీ: వైఎస్సార్ తెలంగాణ పార్టీ (వైతెపా) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమెకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బుధవారం విజయవాడ నుంచి దిల్లీ చేరుకున్న ఆమె.. గురువారం ఉదయం తన భర్త అనిల్‌తో కలిసి ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు.

అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సమక్షంలో ఆమె కాంగ్రెస్‌లో చేరారు. దీంతో వైతెపాను హస్తం పార్టీలో విలీనం చేసినట్లయింది.

**ఏ బాధ్యత అప్పగించినా శక్తివంచన లేకుండా పనిచేస్తా: షర్మిల :** వైతెపాను కాంగ్రెస్‌లో విలీనం చేయడం సంతోషంగా ఉందని వైఎస్ షర్మిల అన్నారు. ఇవాళ్టి నుంచి కాంగ్రెస్‌లో వైతెపా ఒక భాగమని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరిన అనంతరం ఆమె మాట్లాడారు. "వైఎస్సార్ తన జీవితమంతా కాంగ్రెస్ పార్టీ కోసమే పనిచేశారు. మా నాన్న అడుగుజాడల్లోనే నడుస్తున్నా. దేశంలో అతిపెద్ద లౌకిక పార్టీ కాంగ్రెస్. కేసీఆర్ వ్యతిరేక ఓటు చీలకూడదనే తెలంగాణ ఎన్నికల్లో వైతెపా పోటీ చేయలేదు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడటం మా నాన్న కల. అది నెరవేర్చడానికి మనస్ఫూర్తిగా పనిచేస్తాను. పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా శక్తివంచన లేకుండా కృషిచేస్తా" అని షర్మిల అన్నారు. కాంగ్రెస్‌లో షర్మిల చేరిన నేపథ్యంలో ఆమెకు పార్టీ ఏ బాధ్యతలు అప్పగిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఏఐసీసీలో పదవి ఇస్తారా? ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు అప్పగిస్తారా? అనేదానిపై జోరుగా ఊహాగానాలు కొనసాగుతున్నాయి.



# భారాస అధినేత కేసీఆర్‌కు సీఎం జగన్ పరామర్శ



హైదరాబాద్: భారాస అధినేత కేసీఆర్‌ను ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరామర్శించారు. గురువారం ఉదయం తాడేపల్లి నుంచి బయలుదేరిన జగన్.. 11:30 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్వాగతం పలికారు.
అనంతరం బంజారాహిల్స్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి జగన్ వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గత నెలలో కేసీఆర్ ప్రమాదవశాత్తు జారిపడడంతో ఎడమ తుంటికి వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన అనంతరం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

# మునిగిపోయే వైకాపా నావను ఏ శక్తీ కాపాడలేదు: లోకేశ



అమరావతి: అభ్యర్థులు పారిపోయినా, సీట్లు మార్చినా మునిగిపోయే వైకాపా నావను ఏ శక్తీ కాపాడలేదని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ప్రజాగ్రహానికి గురైన వైకాపా ఎమ్మెల్యేలు, ఎంపీలు పరారీలో ఉన్నారన్నారు. ఇప్పటివరకు 35 మంది తమ సొంత నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు భయపడి పారిపోయారని ఎద్దేవా చేశారు. వైకాపాలో ఓటమి భయానికి ఇది ప్రత్యక్ష నిదర్శనమన్నారు. మరో 50 మంది వైకాపా ఎమ్మెల్యేలు కూడా తమ సొంత స్థానాల్లో పోటీ చేసేందుకు విముఖంగా ఉన్నారని చెప్పారు. 2024లో ఇక జగన్ అధికారంలోకి రారని.. ఆంధ్రప్రదేశ్ బైబై జగన్ అంటోందని లోకేశ్ పేర్కొన్నారు.

# తెదేపా కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన నారా భువనేశ్వరి

జి.సిగడాం: తెదేపా అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్ర కొనసాగుతోంది. చంద్రబాబు అరెస్ట్‌తో మనస్తాపానికి గురై మృతిచెందిన వారి కుటుంబాలను ఆమె పరామర్శిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం దవళపేటకు చెందిన తెదేపా కార్యకర్త కంచరాన అసిరి నాయుడు గుండెపోటుతో మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని భువనేశ్వరి ఓదార్చారు. మృతుడి భార్య అరుణకుమారికి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. పార్టీ తరఫున కుటుంబానికి అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. భువనేశ్వరి వెంట మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఎమ్మెల్సీ అనురాధ, నేతలు కిమిడి నాగార్జున, రాంమల్లిక్‌నాయుడు తదితరులు ఉన్నారు




# బీజేపీ కొత్త నినాదం ఏపీ లో డిపాజిట్లు కోసమేనా ?



విశాఖపట్నం : ఎన్నికలు ముంచుకొస్తున్న నేపథ్యంలో జనాలను ఆకర్షించేందుకు ఏపీ బీజేపీ సరికొత్త నినాదాన్ని ఎత్తుకున్నది. అదేమిటంటే బీసీ నినాదం. ఏపీలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ నేతే ముఖ్యమంత్రి అవుతారనే నినాదాన్ని కొత్తగా మొదలుపెట్టింది. బీజేపీ అధికారంలోకి వస్తే అన్న మాటే చాలామందికి పెద్ద జోక్ గా ఉంటుంది. ఎందుకంటే 175 నియోజకవర్గాల్లో పోటీచేయటానికి గట్టి అభ్యర్థులే లేని పార్టీ కూడా అధికారంలోకి వస్తే అని ఆలోచిస్తోందంటే విచిత్రమనే చెప్పాలి. ఇలాంటి స్లోగనే తెలంగాణా ఎన్నికల్లో కూడా ఇచ్చింది కానీ పెద్దగా వర్కవుట్ కాలేదు. బీసీ నేత బండి సంజయ్ ను అధ్యక్షుడిగా తీసేసి కిషన్ రెడ్డిని నియమించిన తర్వాత పార్టీ బీసీ నినాదాన్ని ఎత్తుకోవటం పెద్ద జోక్ అయిపోయింది. ఇపుడు ఇదే నినాదంతో ఏపీ ఎన్నికలను దున్నేయాలని కమలనాదులు ప్లాన్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఈనెల 7వ తేదీన వైజాగ్ లో భారీ బహిరంగసభ ఏర్పాటుచేయబోతున్నారు. బీసీలకు బీజేపీ ఇస్తున్న, ఇవ్వబోతున్న ప్రాధాన్యత గురించి బహిరంగసభలో నేతలు చెప్పబోతున్నారు. గట్టిగా మాట్లాడాలంటే ఏపీ బీజేపీలో గట్టి నేతలే లేరు. అలాంటిది బీసీ నేతలు ఇంకెక్కడ దొరుకుతారు. ప్రజాబలం ఉన్న నేతల కోసం టార్చిలైట్ వేసి వెతకాల్సిందే. పార్టీలో చాలామంది పెద్ద లీడర్లున్నారు కాని వాళ్ళలో చాలామంది మీడియా సమావేశాల్లో మాట్లాడేందుకు మాత్రమే పనికొస్తారు. పార్టీ తరపున క్షేత్రస్థాయిలో పోరాటాలు చేసిందిలేదు, ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేసి సొంతబలంతో వెయ్యి ఓట్లు కూడా సాధించలేరు. ఇంతకుముందు పార్టీకి అధ్యక్షుడిగా పనిచేసిన సోమువీర్రాజు అయినా ఇప్పటి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అయినా ఇదే తంతు. వీళ్ళు పోటీచేస్తే తమ నియోజకవర్గాల్లో కనీసం డిపాజిట్లు కూడా తెచ్చుకోలేరు. ఇలాంటి నేతలంతా చాలా ప్రముఖులుగా పార్టీలో చేలామణి అయిపోతున్నారు. కాబట్టి గట్టి బీసీనేత లేని పార్టీ బీసీ నినాదాన్ని కాయిన్ చేయాలని అనుకుంటే ఏమిటి ఉపయోగమో అర్ధంకావటంలేదు. 7వ తేదీ బహిరంగసభకు కూడా కేంద్రంలోని ప్రముఖ బీసీ నేతలను రప్పిస్తున్నారంటేనే పారిస్థితి ఏమిటో అర్ధమైపోతోంది. మరి కొత్తగా ఇవ్వబోతున్న బీసీ నినాదం ఏ మేరకు ఉపయోగపడుతుందో చూడాలి.

# ఎన్నికలకు సిద్ధం కావాలని అధికారులకు సీఎస్ జవహర్ రెడ్డి కీలక ఆదేశాలు



అమరావతి: ఏపీ సచివాలయంలో సాధారణ ఎన్నికలపై సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి కీలక సమావేశం నిర్వహించారు. సాధారణ ఎన్నికలు పటిష్ట నిర్వహణపై ఇప్పటి నుండే కార్యాచారణ సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు సహా ఎన్నికల విధులతో నేరుగా సంబంధం ఉన్న వివిధ అధికారుల ఖాళీల భర్తీ చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం, జిల్లా ఎన్నికల అధికారుల కార్యాలయాల్లో అవసరమైన సిబ్బంది కేటాయింపు అంశాలపై సీఈఓ ముఖేష్ కుమార్ మీనాతో సీఎస్ చర్చించారు. వెంటనే సిబ్బంది నియామకానికి ప్రతిపాదనలను పంపాలని సీఇవోను సీఎస్ కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల విధుల నిర్వహణతో సంబంధం ఉండి ఒకే ప్రాంతంలో మూడు నాలుగేళ్ళ సర్వీసు పూర్తి చేసుకున్నఅధికారులు తప్పనిసరి బదిలీ చేయాలని సీఎస్ తెలిపారు. కొత్తవారికి పోస్టింగులు వంటి వాటిపై కూడా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఉండాల్సిన కనీస సౌకర్యాలకు సంబంధించిన అంశాలపై సీఇఓతోపాటు ఇతర అధికారులతో సీఎస్ సమీక్షించారు. రానున్నఎన్నికల్లో డబ్బు, మద్యం వంటివి అక్రమ రవాణా నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో ఇంటిగ్రేటెడ్ చెక్కు పోస్టుల ఏర్పాటుపై చర్చించారు. సరిహద్దు నిఘా ముఖ్యంగా ఏపీ, ఒడిస్సా రాష్ట్ర అధికారులతో త్వరలో ఒక సమన్వయ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. రానున్నసాధారణ ఎన్నికల నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, రవాణా, ఆర్ అండ్బి, పంచాయితీరాజ్, విద్యా, మున్సిపల్ తదితర శాఖలు ఇప్పటి నుండే తగిన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. "ఎన్నికల సన్నాహక ఏర్పాట్లపై సమీక్షకు కేంద్ర ఎన్నికల సంఘం రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈనెల 9వ తేదీన రాష్ట్రానికి వస్తుంది. 10న విజయవాడలో సీఎస్, డీజీపీ, సీఇఓ సహా ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, ఆర్ అండ్బి, అటవీ, విద్యా తదితర శాఖల ఉన్నతాధికారులతో సమీక్షిస్తుంది. రాష్ట్రంలో 46వేల 165 పోలింగ్ కేంద్రాలున్నాయి. వాటిలో ఉండాల్సిన కనీస సౌకర్యాలు, తీసుకోవాల్సిన చర్యలను సీఎస్ దృష్టికి తెచ్చాం. వివిధ పోలింగ్ కేంద్రాల్లో విభిన్నప్రతిభావంతులకు ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై కూడా జిల్లా ఎన్నికల అధికారులకు ఆదేశాలు ఇవ్వాలి. రాష్ట్ర ఎన్నికల కార్యాలయం, జిల్లా ఎన్నికల అధికారుల కార్యాలయాల్లో ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని డిప్యుటేషన్ పై నియమించాలి. ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ లాజిస్టిక్ ఏర్పాట్లు, మెన్ అండ్ మెటీరియల్, కోవిడ్ ప్రోటోకాల్ నిబంధనలు అమలు తదితర అంశాలపై సమావేశంలో సీఇవో ప్రస్తావించా." అని ఏపీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. "రాష్ట్రంలో అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో 29 ఇంటిగ్రేటెడ్ చెక్కు పోస్టులున్నాయి. వాటిని పటిష్టంగా నిర్వహించి డబ్బు, మద్యం, గంజాయి ఇతర మత్తు పదార్ధాల అక్రమ రవాణాలను నివారిస్తాం. వీటితో పాటు రాష్ట్రంలో 76 పోలీస్ చెక్కు పోస్టులు,14 అటవీ చెక్కు పోస్టులున్నాయి. వీటన్నిటి ద్వారా నిఘాను మరింత ముమ్మరం చేస్తాం." అని రాష్ట్ర ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ ఎం.రవి ప్రకాశ్ తెలిపారు.



# వెంటనే ఆ దేశాన్ని వీడండి..

## తమ పౌరులకు ప్రపంచ దేశాల హెచ్చరికలు

హమాస్ అగ్రనేత సలేహ్ అరౌరీని ఇజ్రాయెల్ డ్రోన్ మట్టుపెట్టడంతో రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం విస్తరిస్తుందనే ఆందోళనలు పెరగడంతో లెబనాన్‌లో ఉన్న తమ పౌరులకు పలు దేశాలు అడ్వైజరీలను జారీ చేశాయి. తక్షణమే లెబనాన్‌ను వీడాలని కోరాయి. 'ఇప్పటికీ లెబనాన్‌లో ఉన్న మా పౌరులు 'ఎలిఫాండ్' జాబితాలో రిజిస్టర్ చేసుకోవాలి. సాధ్యమైనంత తర్వగా ఆ దేశాన్ని విడిచిపెట్టాలి' అని జర్మనీ విదేశాంగ శాఖ హెచ్చరించింది. అక్టోబర్‌లో యుద్ధం మొదలైనప్పుడు కూడా ఈ తరహా అడ్వైజరీని జారీ చేసింది.


కెనడా, స్వీడన్ సహా పలు అమెరికా మిత్రదేశాలు ఇదే తరహాలో తమ పౌరులకు జాగ్రత్తలు చెప్పాయి. సలేహ్ అరౌరీ హమాస్ అల్-కస్సం బ్రిగేడ్ వ్యవస్థాపకుల్లో ఒకడు. 2010 నుంచి హమాస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు. ముఖ్యంగా ఇరాన్, హమాస్ మధ్య సంబంధాల బలోపేతంలో ఇతడి పాత్రే కీలకం. హమాస్ సంస్థను మట్టుపెట్టడమే తమ లక్ష్యమని ప్రకటించిన ఇజ్రాయెల్.. లెబనాన్ రాజధాని బీరుట్‌లో డ్రోన్ దాడి ద్వారా అరౌరీని హతమార్చింది. ఈ దాడి గురించి మిత్రదేశమైన అమెరికాతోనూ ముందుగా పంచుకోలేదు. తమ దాడుల్లోనే అరౌరీ మృతి చెందాడని ఇంతవరకు ఇజ్రాయెల్ ప్రకటించుకోలేదు. కానీ హమాస్, హెజ్‌బొల్లా, లెబనాన్ భద్రతా దళాలు మాత్రం ఈ ఘటన వెనక ఇజ్రాయెల్ హస్తం ఉందని ఆరోపిస్తున్నాయి. అరౌరీ మృతికి బదులు తీర్చుకుంటామని హెజ్‌బొల్లా ప్రకటించింది. మరోపక్క.. మిగిలిన బందీలు, కాల్పుల విరమణ కోసం జరుగుతోన్న చర్చలను హమాస్ నిలిపివేసింది. ఇప్పటికీ హమాస్ చెరలో 129 మంది బందీలుగా ఉన్న విషయం తెలిసిందే.



# అమెరికాలో రాష్ట్రాల క్యాపిటల్ భవనాలకు బాంబు బెదిరింపులు

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికాలో బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం రేపుతున్నాయి. పలు రాష్ట్రాల క్యాపిటల్ భవనాలకు ఈ బెదిరింపులు రావడంతో అప్రమత్తమైన పోలీసులు వాటిని ఖాళీ చేయించారు. ఇరాన్‌లో భీకర పేలుళ్ల వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. జార్జియా, కనెక్టికట్, కెంటుకీ, మిషిగాన్, మిన్నెసోటా, మిసిసిపీ, మోంటానా, మైన్, హవాయి రాష్ట్రాల క్యాపిటల్ భవనాలకు బుధవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) ఈ బాంబు బెదిరింపులు వచ్చాయి. గుర్తుతెలియని ఈ-మెయిల్ ఐడీ నుంచి ఒకేసారి అన్ని ఆఫీసులకు ఈ సందేశాలు చేరినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు తక్షణమే ఆ భవనాలను ఖాళీ చేయించి డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టారు. అయితే, ఎక్కడా పేలుడు పదార్థాలు లభించలేదని పోలీసులు వెల్లడించారు. అవి నకిలీ బెదిరింపులని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) తెలిపింది. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొంది. ఇటీవల అమెరికాలో ప్రాంక్ కాల్స్ బెడద తీవ్రమైంది. ప్రభుత్వ అధికారుల ఇళ్లల్లో కాల్పులు జరిగాయంటూ కొంతమంది పోలీసులకు ఫోన్ చేసి తప్పుడు సమాచారం ఇస్తున్నారు. క్రిస్మస్ రోజున రిపబ్లికన్ చట్టసభ్యుడి ఇంట్లో కాల్పులు జరిగినట్లు వచ్చిన నకిలీ ఎమర్జెన్సీ కాల్ కలకలం సృష్టించింది. ఆ తర్వాత ట్రంప్‌ను ప్రైమరీ పోరు నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకొన్న మైన్ రాష్ట్ర సెక్రటరీ (ఎన్నికల అధికారి) షెన్నా బెల్లోస్‌కు కూడా ఇలాగే ప్రాంక్ కాల్స్ చేశారు. తాజా ఘటన కూడా ఆ కోవలోనిదే అని పోలీసులు అనుమానిస్తున్నారు. మరోవైపు ఇరాన్‌లో బుధవారం జంట పేలుళు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. నాలుగేళ్ల కిందట అమెరికా దాడిలో మరణించిన ఇరాన్ జనరల్ ఖాసిం సులేమానీ సమాధి వద్ద నివాళులర్పించేందుకు భారీగా జనం తరలివచ్చిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడి వెనుక ఇజ్రాయెల్, అమెరికా హస్తం ఉందంటూ ఇరాన్ ఆరోపిస్తోంది.

# కాంగ్రెస్‌లో షర్మిల చేరినంత మాత్రాన మా కాళ్లు మేమే నరుక్కుంటామా?



చిత్తూరు: వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో ఏపీ మంత్రి పెద్దిరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరు ఉన్నా.. జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా ఎవరు పనిచేసినా తాము ప్రతిపక్షంగానే చూస్తామన్నారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరినంత మాత్రాన రాజకీయాల్లో తమ కాళ్లు తామే నరుక్కుంటామా? అని ప్రశ్నించారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎం ఎస్ బాబు ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని పెద్ది రెడ్డి అన్నారు. రెచ్చగొట్టే విధంగా ఆయన మాట్లాడడం మంచిది కాదన్నారు. ఒక జడ్పీటీసీగా ఓడిపోయిన ఆయన్ని ఎమ్మెల్యేగా ఎలా చేశామన్నది గుర్తించాలని పెద్దిరెడ్డి అన్నారు. "కుటుంబాలను చీల్చి రాజకీయాలు చేసే నైజం సోనియాగాంధీది, చంద్రబాబుది. అందుకే ఆనాడు ఇద్దరూ కలిసి జగన్‌ను జైలుకు పంపించారు. కుటుంబాల్ని కాదు మనుషులను చీల్చి రాజకీయాలు చేసిన ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. రాజకీయాల్లో ఎన్నో మార్పులు చేర్పులు జరుగుతూ ఉంటాయి. పద్దతి ప్రకారం రాజకీయాలు నడిపిన వ్యక్తులం. ఆ పద్ధతి ప్రకారమే జగన్‌తోనే ఉంటాం. మంచి జరిగినా.. చెడు జరిగినా జగన్ వెంట ఉంటాం. జగనే మా నాయకుడు ఆయనతోనే కలిసి పని చేస్తాం. తిరిగి జగన్ సీఎం అధికారంలోకి వచ్చేందుకు తామంతా కృషి చేస్తాం" అని పెద్దిరెడ్డి పేర్కొన్నారు.

# సూపర్ సింగర్ కోసం సూపర్ అందం

బుల్లి తెరపై రాములమ్మ అంటూ పేరు దక్కించుకున్న యాంకర్ శ్రీముఖి సోషల్ మీడియా ద్వారా తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా రెగ్యులర్ గా తన ఫాలోవర్స్ కి మరియు ప్రేక్షకులకు కన్నుల విందు చేస్తుంది అనడంలో సందేహం లేదు. హీరోయిన్ మెటీరియల్ అనిపించుకునే శ్రీముఖి సోషల్ మీడియాలో షేర్ చేసే ఫోటోలు మరియు వీడియోలు చాలా వరకు స్టార్ హీరోయిన్స్ ని బీట్ చేసే అందంతో అలరిస్తూ ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ ను అందుకోవడం జరుగుతూ ఉంటుంది. తాజాగా మరోసారి శ్రీముఖి



తన అందంతో నెటిజన్స్ ని సర్ ప్రైజ్ చేసింది. అందమైన శ్రీముఖి ప్రముఖ శాటిలైట్ ఛానల్ లో టెలికాస్ట్ అవుతున్న సూపర్ సింగర్ కార్యక్రమంకు యాంకర్ గా వ్యవహరిస్తుంది. ఆ షో కు సంబంధించిన తాజా ఎపిసోడ్ టెలికాస్ట్ సందర్భంగా ఈ ఫోటోలు షేర్ చేసింది. షో కోసం హీరోయిన్ రేంజ్ లో అందంగా రెడీ అయిన ముద్దుగుమ్మ శ్రీముఖి ని చూసి అంతా కూడా వావ్ అంటున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. శ్రీముఖి ఇలా చిన్న చిన్న కార్యక్రమాలు చేయకుండా హీరోయిన్ గా చేస్తే బాగుంటుంది కదా అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## మండే బ్లూస్ కాదు అమ్మడు మంటలు పుట్టించే బ్లూ!

ఇండియాలో స్వీడన్ బ్యూటీగా ఫేమస్ అయి ఎల్లి అవ్రామ్ సుపరిచితమే. మిక్కి వైరస్ తో బాలీవుడ్ లో లాంచ్ అయిన అమ్మడి జర్నీ అటు పై నత్తనడకనే సాగింది. ఏడాదికో సినిమా చొప్పున..మధ్య మధ్యలో గ్యాప్ లతో కెరీర్ ని నెట్టుకొచ్చింది. ఏ దశలోనూ సొగసరి బిజీగా నటిగా మారింది లేదు. అలాగని ఖాళీగానూ లేదు. వచ్చిన అవకాశాలు అందిపుచ్చుకుంటూ బండి ముందుకు సాగించింది. ఇటీవలే రిలీజ్ అయిన గణపత్ సినిమాలోనూ నటించింది. ఇక టెలివిజన్ షోస్..వెబ్ సిరీస్ ల్లో సైతం తనదైన మార్క్ వేసే ప్రయత్నం చేసింది. కానీ అక్కడా ఫలించలేదు. ప్రస్తుతానికి చేతిలో సినిమాలైతే లేవు. కొత్త అవకాశాల కోసం ఎదురుచూస్తోంది. అమ్మడు మళ్లీ సౌత్ లోనూ రాణించాలని సీరియస్ ప్రయత్నాలు చేస్తోంది. అయితే



తెలుగులో ఇంతవరకూ లాంచ్ అవ్వలేదు. తమిళ్..కన్నడలో ఇప్పటికే అదృష్టాన్ని పరీక్షించుకుంది. ఇక చివరిగా టాలీవుడ్ ఛాన్స్ ఇస్తుందా? అని ఎదురు చూస్తుంది. అందుకు తగ్గట్టు తనని తాను సోషల్ మీడియాలోనూ అంతే తీర్చిదిద్దుకుంటుంది. ఈ అమ్మడు ప్రత్యేకంగా గ్లామర్ డోస్ పరంగా ప్రత్యేకంగా షైన్ అవ్వాల్సిన పనిలేదు. స్వీడన్ నుంచి దిగిన బ్యూటీ కాబట్టి అందాల విందు వడ్డించడం కొత్తేం కాదు. తానేంటో కెరీర్ ఆరంభంలోనే ప్రూవ్ చేసింది. తానెంత అడ్వాన్స్ గాళ్ అన్నది బాలీవుడ్ లో ఎప్పుడో పరిచయం చేసింది. ఇక సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు అంతే యాక్టివ్ గా ఉంటుంది. తనదైన శైలి ఎలివేషన్లతో కుర్రకారుని ఆకర్షిస్తుంది. తాజాగా సెగలు పుట్టించే ఫోటోతో నెట్టింట చర్చకు వచ్చేసింది. ఇదిగో ఇక్కడిలో బ్లూ కలర్ టూపీస్ లో అమ్మడు ఇలా బీచ్ లో సెగలు పుట్టించే భంగిమతో ముందుకు వచ్చేసింది. ఈఫోటోని ఉద్దేశించి మండే బ్లూస్ అంటూ ఓ క్యాప్షన్ ఇచ్చింది. అది మండే బ్లూస్ కాదు..మంటలు పుట్టించే బ్లూస్ అంటూ నెటి జనులు కౌంటర్ కి దిగారు.




## 'హనుమాన్' సెన్సార్ కంప్లీట్.. రన్ టైం ఎంతంటే?



టాలీవుడ్ యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా వస్తున్న ఇండియన్ సూపర్ హీరో మూవీ 'హనుమాన్' సంక్రాంతి కానుకగా విడుదల కాబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ తో ఈ మూవీపై ఆడియన్స్ లో భారీ హైప్ క్రియేట్ అయింది. తేజ సజ్జా హీరోగా నటించిన ఈ మూవీ ట్రైలర్ ఇటీవలే రిలీజ్ అయి సినిమాపై మరింత క్యూరియాసిటీ పెంచేసింది. రిలీజ్ టైమ్ దగ్గర పడడంతో మేకర్స్ సినిమాకు సంబంధించిన పనులను చకచకా పూర్తి చేస్తున్నారు. ఈ క్రమంలోనే హనుమాన్ తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఇదే విషయాన్ని మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. హనుమాన్ మూవీకి సెన్సార్ యూనిట్ %ఖ/ూ% సర్టిఫికేట్ ఇచ్చింది. అలాగే ఈ సినిమా నిడివి 2 గంటల 30 నిమిషాలుగా ఉండబోతోంది. కాగా హనుమాన్ మూవీ సెన్సార్ పూర్తి చేసుకున్నట్లు మేకర్స్ తాజాగా సరికొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్లో చిరుత బారి నుంచి జింకను కాపాడి ఎత్తుకొని తేజ సజ్జా పరుగెత్తుతున్నట్టు ఈ పోస్టర్ ఉంది. తొలి ఇండియన్ సూపర్ హీరో ఫిలింగా హనుమాన్ రాబోతోంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ లో ఫస్ట్ మూవీగా హనుమాన్ వస్తోంది. ఈ సూపర్ హీరో యునివర్స్ లో మొత్తంగా 12 సినిమాలు ఉంటాయని తాజాగా ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు ప్రశాంత్ వర్మ వెల్లడించారు. సినిమాలో తేజ సజ్జా హనుమంతుడి వల్ల అతీత శక్తులు పొందే యువకుడి పాత్రలో కనిపించనున్నాడు. అతని సరసన అమృత హీరోయిన్గా నటిస్తోంది. వరలక్ష్మి శరత్ కుమార్, వినయ్ రాయ్, వెన్నెల కిశోర్, గెటప్ శ్రీను, సముద్ర ఖని కీలకపాత్రలు పోషించారు. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె.నిరంజన్ రెడ్డి సుమారు రూ.75 కోట్ల భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమాని పాన్ వరల్డ్ లెవెల్ లో రిలీజ్ చేస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషలతో పాటుగా ఇంగ్లీష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్‌తో సహా పలు విదేశి భాషల్లో విడుదల చేయనున్నారు. తెలుగుల్లో కంటే హిందీలో అత్యధికంగా సుమారు 1500 థియేటర్స్ లో ఈ సినిమాని రిలీజ్ చేయబోతున్నారు అనుదీప్ దేవ్, హరి గౌడ, కృష్ణ సౌరభ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 12 న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## తాప్సీ తర్వాత పూజా ఎందుకిలా?






ఝుమ్మందినాదం చిత్రంతో టాలీవుడ్ లో అడుగుపెట్టిన తాప్సీ పన్ను ఆ తర్వాత ఇక్కడ ఆశించిన కెరీర్ దక్కక తమిళంలోకి వెళ్లిపోయింది. అయితే అక్కడా స్టార్ డమ్ ఆశించిన స్థాయికి చేరుకోలేదు. దీంతో హిందీ చిత్రసీమలో తన మూలాల్ని వెతుక్కుంది. దిల్లీకి చెందిన ఈ బ్యూటీ బాలీవుడ్ లో బలమైన ముద్ర వేసేందుకు లేడీ ఓరియెంటెడ్ కథాంశాల్ని ఎంపిక చేసుకుంది. కొన్ని గట్స్ ఉన్న పాత్రల్లో నటించి తాప్సీ ల్యాండ్ మార్క్ గా మారింది. అటుపై గ్లామరస్ పాత్రలను బ్యాలెన్స్ చేస్తూ తాప్సీ తన ఉనికిని చాటుకుంటోంది. అయితే తాప్సీ బాలీవుడ్ లో సక్సెస్ సాధించాక టాలీవుడ్ లో ప్రముఖ దర్శకుడిని విమర్శించడంతో ఇక ఇక్కడ అవకాశాల తలుపులు పర్మినెంట్ గా మూసుకుపోయాయి.

తాప్సీ తరహాలోనే అగ్ర నాయిక హోదాకు చేరుకున్నాక పూజా హెగ్డే పైనా చాలా విమర్శలు ఆరోపణలు వచ్చాయి. ఆ ఇద్దరి కెరీర్ జర్నీ పూర్తిగా వేరు. పూజా హెగ్డే ఒక తమిళ ఫ్లాప్ సినిమాతో కెరీర్ ప్రారంభించి అటుపై టాలీవుడ్ లో ముకుంద లాంటి హిట్ చిత్రంతో రంగ ప్రవేశం చేసింది. అటుపై అగ్ర హీరోలందరి సరసనా అవకాశాలందుకుంది. టాలీవుడ్ లో భారీ బ్లాక్ బస్టర్లలో ఆల్మోస్ట్ అందరు హీరోల సరసనా నటించింది. ఇక్కడ మంచి డిమాండ్ ఉన్న స్టార్ గా ఓ వెలుగు వెలిగిపోయింది. అల వైకుంఠపురములో చిత్రంతో బాపు బొమ్మగాను ప్రజల హృదయాల్ని గెలుచుకుంది. అయితే అనూహ్యంగా పూజా కెరీర్ లో వరుస ఫ్లాపులు ఐరెన్ లెగ్ ముద్రను వేసాయి రాధే శ్యామ్-ఆచార్య-కెకెబిజె వంటి ఫ్లాప్ చిత్రాలతో పూజా ప్రజాదరణ కోల్పోయింది. హరీష్ శంకర్ ఉస్తాద్ భగత్ సింగ్ ఆఫర్, త్రివిక్రమ్ - మహేష్ ల గుంటూరు కారం ఆఫర్లను కోల్పోవడంతో పూజా కి ఏమైంది? అంటూ సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే పూజా హెగ్డే భారీ పారితోషికం డిమాండ్ సహా సిబ్బంధికి హై క్లాస్ సౌకర్యాలు కావాలని కోరుతోందని దాని వల్ల మేకర్స్ తనవైపు మొగ్గు చూపడం లేదని కూడా ప్రచారం సాగిపోయింది. ఇటీవల హరీష్ మరో కొత్త ఆఫర్ ఇవ్వాలని అనుకున్నాడు. రవితేజతో మిస్టర్ బచ్చన్ లో పూజాకు అవకాశం ఇచ్చినా కానీ సుమారు 3 కోట్ల పారితోషికం డిమాండ్ చేయడంతో మేకర్స్ తనను కాదనుకుని ఒక కొత్త కథానాయికు అవకాశం ఇచ్చారు. సహజంగానే రవితేజ ఇటీవల కొత్త కథానాయికలకు అవకాశాలు కల్పిస్తున్నాడు. తక్కువ పారితోషికంతో కొత్త భామలతో పనవుతుందని నిర్మాతలకు సూచిస్తున్నాడని ప్రచారం ఉంది. అనంతరం పూజా స్థానంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా ఎంపికైంది. అయితే పూజా కావాలనే పెద్ద పారితోషికం డిమాండ్ చేయడం ద్వారా ఈ ప్రాజెక్టును లైట్ తీస్కుందా? అన్న చర్చా ఇప్పుడు మొదలైంది.

తాప్సీ లాంటి కథానాయికతో పోలిక లేకపోయినా కానీ, పూజా కూడా అవకాశాలను కావాలనే కోల్పోతోందని గుసగుస వినిపిస్తోంది. ప్రస్తుతం పూజా హెగ్డే ఓ వెబ్ సిరీస్ సహా షాహిద్ సరసన ఓ చిత్రంలోను నటిస్తోంది. కారణం ఏదైనా దక్షిణాదిన తనకు గడ్డుకాలం ఎదురైందన్నది సుస్పష్టం.

## సనా చీరకట్టులో సంథింగ్ ఏదో ఉందిలే

పరిశ్రమలో ఎందరు ఫ్యాషనిస్టాలు ఉన్నా ఫాతిమా సనా షేక్ అందరిలో తనలోని విలక్షణత, ప్రత్యేకతను చాటుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ భామ క్లాసీ లుక్స్ కి సంబంధించిన ఫోటోషూట్లు ఇప్పటికే అంతర్జాలంలో హాట్ టాపిక్. ముఖ్యంగా చీరలో సనా షేక్ అందచందాలు ఎప్పుడూ యూనిక్ నెస్ ని కలిగి ఉంటాయనేది తన అభిమానుల అభిప్రాయం. ఇప్పుడు అలాంటి మరో శారీ లుక్ ఫ్యాన్స్ లోకి దూసుకెళ్లింది. అయితే ఈ చీరకు ఒక ప్రత్యేకత ఉంది. ఇది రీసైకిల్ చేసిన కాటన్ తో ఫ్యాక్టరీలో రూపొందించినదని సనా షేక్ తెలిపింది. సనా తన ఇన్ స్టాలో ఈ విషయాన్ని షేర్ చేస్తూ చీర నేతకు సంబంధించిన ఆసక్తికర విషయాల్ని రివీల్ చేసింది. "గొప్ప కథ, చరిత్ర ఉన్న ఇలాంటి చీరను ధరించడం ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటుంది. ఈ చీర గురించి ఇక్కడ కొన్ని విషయాలున్నాయి. హిమ్రూలో రుహానీ బ్లౌజ్‌తో రాధ చీర ఇది. ఈ గొప్ప వైలెట్ రంగును పొందడానికి ఆ శారీ పీస్ లకు సప్పన్ కలపతో రంగులు వేస్తారు. హిమ్రూ అనేది మహారాష్ట్రకు చెందిన వారసత్వ నేత.. ఇది రీసైకిల్ కాటన్ తో పునరుద్ధరిస్తారు. వస్త్ర వ్యర్థాలను తిరిగి ఫైబర్‌గా విచ్ఛిన్నం చేస్తారు. ఈ సాంప్రదాయ వస్త్రాన్ని చేతితో నేసే దాని నుండి కొత్త నూలును తయారు చేస్తారు" అని తెలిపింది. అమీర్ ఖాన్ 'దంగల్' చిత్రంతో ఫాతిమా సనా షేక్ కెరీర్ జర్నీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆరంగేట్రమే అగ్రహీరో సరసన అవకాశం అందుకుని ఆ తర్వాత అతడితోనే ప్రేమలో పడడంపైనా అభిమానుల్లో చర్చ సాగింది.



ఈ ఏడాదితో దంగల్ ఏడేళ్లు పూర్తి చేసుకుంది. 7 సంవత్సరాల దంగల్‌పై ఫాతిమా సనా షేక్ ఆసక్తికరంగా స్పందించింది. నా సినిమా కెరీర్ భావోద్వేగాల రోలర్ కోస్టర్ రైడ్ అని వ్యాఖ్యానించింది. 2023 డిసెంబర్ 23 నాటికి దంగల్ ఏడేళ్ల మైలురాయిని అందుకుంది. ఈ చిత్రం బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టడమే కాకుండా ప్రేక్షకులకు అద్భుతమైన ప్రతిభను పరిచయం చేసింది. ఇందులో ఒక కీలక పాత్ర పోషించిన ఫాతిమా సనా షేక్ పేరు మార్మోగింది. ఫాతిమా సనా షేక్ దంగల్ లో నిజజీవిత అథ్లెట్ గీతా ఫోగట్ పాత్రలో నటించింది. అది తన కెరీర్‌లో గొప్ప మలుపు. ఈ చిత్రం కేవలం సినిమా కళాఖండం కాదు. ఇది ఒక సాంస్కృతిక సంపద. రెజ్లింగ్ ఛాంపియన్ గీతా ఫోగట్ పాత్రలో నటించిన ఫాతిమ ప్రశంసలను పొందింది. ఏడేళ్ల కెరీర్ లో ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో సనా షేక్ ఆకట్టుకుంది. ఫాతిమా ఇటీవల సామ్ బహదూర్ లో ఇందిరా గాంధీ పాత్రలో నటించింది. ధక్ ధక్ చిత్రంలోను తన పాత్రకు మంచి గుర్తింపు దక్కింది. దంగల్ నుండి ధక్ ధక్ వరకు నా సినీ కెరీర్ ఆనందం, కన్నీళ్లు, సంతోషాలు, దుఃఖాలతో కూడిన భావోద్వేగాల రోలర్ కోస్టర్ రైడ్ అని సనా ఓ ఇంటర్వ్యూలో ఉద్వేగానికి గురైంది. గీతా ఫోగట్ ఎల్లప్పుడూ నా హృదయంలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంటుంది. ఈ పాత్రకు లభించిన ప్రేమకు నేను కృతజ్ఞురాలిని అని తెలిపింది. ఫాతిమా బాలీవుడ్‌లో బహుముఖప్రజ్ఞ ఉన్న తారల్లో ఒకరిగా తన స్థాయిని పదిలపరుచుకుంటూ కెరీర్‌ని సాగిస్తోంది.

## మృణాల్ డబుల్ ట్రిపుల్ బిజీ బిజీ

బాలీవుడ్ లో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయినా కూడా పెద్దగా గుర్తింపు దక్కించుకోలేక పోయిన మృణాల్ ఠాకూర్ టాలీవుడ్ లో సీతారామం సినిమా తో ఎంట్రీ ఇచ్చి సూపర్ హిట్ ను దక్కించుకుంది. తక్కువ సమయంలోనే సౌత్ స్టార్ హీరోయిన్ గా గుర్తింపు దక్కించుకుంది. సీతారామం తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న ఈ అమ్మడు హాయ్ నాన్న అంటూ మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నానితో ఆ సినిమాను చేసిన మృణాల్ కి మరో భారీ విజయం దక్కింది. బ్యాక్ టు బ్యాక్ బంపర్ హిట్స్ దక్కడంతో మృణాల్ ప్రస్తుతం సౌత్ లో మోస్ట్ బిజీ హీరోయిన్ గా వరుస సినిమాలు చేస్తోంది. టాలీవుడ్ లో మెగాస్టార్ చిరంజీవికి జోడీగా విశ్వంభర సినిమాను చేయబోతుంది అంటూ గత కొన్నాళ్లుగా వార్తలు



వస్తున్నాయి. ఇప్పుడు మృణాల్ తెలుగు లో ప్రముఖ స్టార్ హీరో సినిమాకు సైన్ చేసిందని తెలుస్తోంది. అంతే కాకుండా రాఘవ లారెన్స్ తో కలిసి ఒకే సారి రెండు సినిమాలు చేయబోతుందట. లారెన్స్ హీరోగా రమేష్ వర్మ దర్శకత్వం లో రూపొందుతున్న శ్రీరామ రక్ష సినిమా ను మృణాల్ చేస్తోంది.

అంతే కాకుండా రవికుమార్ తో లారెన్స్ చేస్తున్న సినిమాలో కూడా మృణాల్ హీరోయిన్ గా నటించేందుకు రెడీ అయింది. మొత్తానికి ఒకే సారి చేతిలో అయిదు ఆరు సినిమాలతో మృణాల్ బిజీ బిజీగా ఉంది. సాధారణంగా హీరోయిన్స్ రెండు మూడు సినిమాలు చేస్తేనే బిజీ హీరోయిన్ అంటాం. అలాంటిది ఈ అమ్మడు డబుల్ ట్రిపుల్ బిజీ అన్నట్లుగా సినిమాలు చేస్తోంది. ఈ రేంజ్ లో బిజీగా ఉన్న మృణాల్ టాలీవుడ్ లో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న హీరోయిన్స్ జాబితాలో ముందు వరుసలో ఉందట.




## ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్.. నామినేటెడ్ పదవులపై స్పష్టత వచ్చేనా?

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. సీఎస్ సహా ముఖ్య అధికారులతో కలిసి బేగంపేట నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరారు. ఇవాళ, రేపు ఆయన ఢిల్లీలో పర్యటించనున్నారు. సీఎం వెంట సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ఇంటెలిజెన్స్ చీఫ్ తదితరులు ఉన్నారు. ఇవాళ ఢిల్లీలో నిర్వహించే ఏఐసీసీ సమావేశంలోనూ రేవంత్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కార్పొరేషన్ పదవుల భర్తీ, ఇతర అంశాలపై పార్టీ అధిష్ఠానంతో చర్చించనున్నారు. ఈ నెల 14న సీఎం దావోస్ పర్యటనకు వెళుతున్నందున ఈలోగా కొన్ని పదవులను భర్తీ చేయనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసినవారిలో ఎవరెవరికి ఏయే పదవులు ఇవ్వాలనే జాబితాలను ఏఐసీసీ కార్యదర్శులు తయారు చేస్తున్నారు. ఈ జాబితాలపై అధిష్ఠానంతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారని.. వీటిపై గురువారం ఢిల్లీలో చర్చిస్తారని సమాచారం.



## సీఎం రేవంత్ ఆదాయం ఎంతో.. నా ఆదాయం ఎంతో విచారణకు సిద్ధం.. కిషన్‌రెడ్డి సవాల్

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం హోదాలో రేవంత్ రెడ్డి కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఎందుకు కోరటం లేదని ప్రశ్నించారు. నిర్మాణాత్మకమైన సూచనలు చేస్తే.. కాంగ్రెస్ నేతలు అహంకారంతో తనపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి ఏ విధంగా ఆదాయం సంపాదించారో ప్రతీ తెలంగాణ బిడ్డకు తెలుసన్నారు. ముఖ్యమంత్రి ప్రస్థానం ఎలా మెదలైందో.. తన ప్రస్థానం ఎలా మెదలైందో తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. సీఎం ఆదాయం ఎంతో.. తన ఆదాయం ఎంతో విచారణకు సిద్ధమని సవాల్ విసిరారు. కాళేశ్వరంలో బీజేపీకి వాటా ఉందని.. కాంగ్రెస్‌కు దమ్ముంటే నిరూపించాలన్నారు. లంకె బిందెలు కోసమే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారా? అని ప్రశ్నించారు. కాళేశ్వం అవినీతి విషయంలో కేసీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం రక్షిస్తోందని ఆరోపించారు. కేసీఆర్‌కు తాను కాదు.. కాంగ్రెస్ పార్టీనే బినామీ అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ బిచాణా ఎత్తివేస్తదని.. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే చెత్తబుట్టలో వేసినట్లే అని అన్నారు. కాళేశ్వరంపై పూర్తి వివరాలు ఎంపీ హోదాలో సీబీఐకు ఇస్తానన్న రేవంత్.. సీఎంగా ఇప్పుడెందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. తెలంగాణకు సీబీఐ రాకుండా కేసీఆర్ చట్టం చేశారని... లేకుంటే కేంద్రమే సీబీఐ విచారణ జరిపేదని చెప్పుకొచ్చారు. 15 రోజుల్లోనే ఫార్మా సిటీపై యూ టర్న్ ఎందుకు తీసుకున్నారో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీల లాబీయంకు ముఖ్యమంత్రి లొంగిపోయారన్నారు. రాహుల్ గాంధీ ఉన్నంత వరకు ప్రధానమంత్రిగా మోదీనే ఉంటారన్నారు.

**అభయహస్తం పేరుతో మోసం...** అభయ హస్తం పేరుతో తెలంగాణ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శలు గుప్పించారు. దరఖాస్తు అవసరం లేకుండా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల వరకు కాలయాపన కోసమే ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తులు అని అన్నారు. పార్లమెంట్ ఎన్నివల వరకు కాంగ్రెస్ నేతల ఇంటి చుట్టూ ప్రజలను తిప్పుకోవాలని భావిస్తోందన్నారు. రేషన్ కార్డ్స్ ఇవ్వకుండా .. రేషన్ కార్డుల వివరాలు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. రైతు భరోసా, గ్యాస్ సిలిండర్ వాడే వారి డేటా ప్రభుత్వం వద్ద ఉంటోందన్నారు. కాంగ్రెస్ అభయ హస్తంతో ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరదన్నారు.

**అన్ని దేవాలయాల్లో ఎల్ఈడీ స్క్రీన్స్..** ప్రధాని మోదీ మెడిసిన్ ప్రపంచానికి సంజీవని అని అన్నారు. 22న అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ఠ క్యార్యక్రమం కోసం ప్రతి దేవాలయంలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేస్తామన్నారు. సంక్రాంతి నుంచి 22వ వరకు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అన్ని దేవాలయాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేయనున్నట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఎలాంటి సమ్మె ఉండదు.. యధావిధిగా అద్దె బస్సులు నడుస్తాయి



హైదరాబాద్ : అద్దె బస్సు ఓనర్లతో చర్చలు సఫలం అయ్యాయని టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జ నార్ తెలిపారు. గురువారం బస్ భవన్‌లో అద్దె బస్సు ఓనర్లతో ముగిసిన సమావేశం అనంతరం ఆయన వివరాలను వెల్లడించారు. ఆర్టీసీ అద్దె బస్సు ఓనర్లతో సమావేశంలో పలు అంశాలు చర్చించామని పేర్కొన్నారు. వారు కొన్ని సమస్యలను మా దృష్టికి తీసుకొచ్చారు. వారం రోజుల్లో అద్దె బస్సు ఓనర్ల సమస్యలు పరిష్కారించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇందుకు గాను సమస్యల పరిష్కారం కోసం ఒక కమిటీ వేస్తామని తెలిపారు. రేపటి నుంచి ఎలాంటి సమ్మె ఉండదని, యధావిధిగా అద్దె బస్సులు నడుస్తాయని స్పష్టం చేశారు. సంక్రాంతికి కూడా ఫ్రీబస్ సర్వీస్ ఉంటుందని అలాగే సంక్రాంతికి స్పెషల్ బస్సులను కూడా నడుపుతామని సజ్జనార్ పేర్కొన్నారు. కాగా, అంతకుముందు అద్దె బస్సు ఓనర్ల సంఘం నేతలు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రేపటి నుంచి బస్సులు నడుపమని స్పష్టం చేశారు.

## కేసీఆర్‌ను జగన్ కలవడంపై నారాయణ ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్, జనవరి 4: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఏపీ సీఎం జగన్ కలవడంపై సీపీఐ నేత నారాయణ హాట్ కామెంట్స్ చేశారు. ఓట్ల కోసమే మాజీ సీఎం కేసీఆర్‌ను జగన్ కలిశారని విమర్శలు గుప్పించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఇంట్లో కుంపటి వ్యాఖ్యలు చేసి.. జగన్ తన ఓటమిని ఒప్పుకున్నారన్నారు. తన ఇంట్లో తానే జగన్ గొడవ సృష్టించుకుని ఇతరులను నిందిస్తున్నారన్నారు. చెల్లిని, బాబాయ్‌ను దూరం చేసుకున్నారని.. అధికారానికి కూడా దూరమవుతారని వ్యాఖ్యలు చేశారు. జగన్‌లో మెదటసారి ఓటమి భయం కన్పిస్తుందని.. అందుకే చంద్రబాబుపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో సాయం కోసమే జగన్.. కేసీఆర్ దగ్గరకి వచ్చారన్నారు. కేసీఆర్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని ప్రయత్నించి జగన్ విఫలమయ్యారన్నారు. పోలింగ్ రోజు నాగార్జునసాగర్‌లో లేని గొడవ సృష్టించి జగన్ విఫలమయ్యారని అన్నారు. పొత్తు పేరుతో చంద్రబాబును బీజేపీ నష్టపరచాలని చూస్తోందని అన్నారు. తమను ప్రశ్నించిన వారిని కేంద్రం 17ఏ పేరుతో బెదిరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు, జగన్‌ను కూడా 17ఏతో బీజేపీ భయపెట్టిస్తోందని నారాయణ వ్యాఖ్యలు చేశారు.

## కానిస్టేబుల్ నియామక పరీక్షపై సింగిల్ బెంచ్ తీర్పును కొట్టివేసిన హైకోర్టు



హైదరాబాద్: కానిస్టేబుల్ నియామక పరీక్షపై సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. సివిల్ కానిస్టేబుల్ పరీక్షలో నాలుగు ప్రశ్నలకు సంబంధించి మార్కులు కలపాలని సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ గురువారం హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం సాయం తీసుకొని నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని, అభ్యంతరాలు ఉన్న నాలుగుప్రశ్నలపై నిపుణుల కమిటీ తేల్చాలని పోలీసు నియామక మండలిని ఆదేశించింది.

నాలుగు ప్రశ్నలకు ఆప్షన్లను తెలుగులో ఇవ్వకపోవడం వల్ల నష్టపోయామని కొంతమంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. నాలుగు ప్రశ్నలకు ఆప్షన్లను వాడుకలో ఉన్న పదాలనే ఇచ్చామని పోలీసు నియామక మండలి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లింది. నాలుగు ప్రశ్నలపై అభ్యంతరాలను నిపుణుల కమిటీ తేల్చిన తర్వాత నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ధర్మాసనం ఆదేశించింది. నాలుగు వారాల్లోగా కానిస్టేబుల్ నియామక ప్రక్రియ పూర్తి చేయాలని పోలీసు నియామక మండలికి సూచించింది.




## కాంగ్రెస్‌లో చేరిన వైతెపా అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

ఢిల్లీ: వైఎస్సార్ తెలంగాణ పార్టీ (వైతెపా) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమెకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బుధవారం విజయవాడ నుంచి ఢిల్లీ చేరుకున్న ఆమె.. గురువారం ఉదయం తన భర్త అనిల్‌తో కలిసి ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సమక్షంలో ఆమె కాంగ్రెస్‌లో చేరారు. దీంతో వైతెపాను హస్తం పార్టీలో విలీనం చేసినట్లయింది.

**ఏ బాధ్యత అప్పగించినా శక్తివంచన లేకుండా పనిచేస్తా: షర్మిల :** వైతెపాను కాంగ్రెస్‌లో విలీనం చేయడం సంతోషంగా ఉందని వైఎస్ షర్మిల అన్నారు. ఇవాల్టి నుంచి కాంగ్రెస్‌లో వైతెపా ఒక భాగమని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరిన అనంతరం ఆమె మాట్లాడారు. "వైఎస్సార్ తన జీవితమంతా కాంగ్రెస్ పార్టీ కోసమే పనిచేశారు. మా నాన్న అడుగుజాడల్లోనే నడుస్తున్నా. దేశంలో అతిపెద్ద లౌకిక పార్టీ కాంగ్రెస్. కేసీఆర్ వ్యతిరేక ఓటు చీలకూడదనే తెలంగాణ ఎన్నికల్లో వైతెపా పోటీ చేయలేదు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడటం మా నాన్న కల. అది నెరవేర్చడానికి మనస్ఫూర్తిగా పనిచేస్తాను. పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా శక్తివంచన లేకుండా కృషిచేస్తా" అని షర్మిల అన్నారు. కాంగ్రెస్‌లో షర్మిల చేరిన నేపథ్యంలో ఆమెకు పార్టీ ఏ బాధ్యతలు అప్పగిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఏఐసీసీలో పదవి ఇస్తారా? ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు అప్పగిస్తారా? అనేదానిపై జోరుగా ఊహాగానాలు కొనసాగుతున్నాయి.

## బీఆర్ఎస్ పార్టీ భవన్‌కు నోటీసులు..



హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ భవన్‌కు రెవెన్యూ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. పార్టీ కార్యాలయంలో టీ న్యూస్ ఛానల్ ద్వారా వ్యాపారం చేయడంపై నోటీసులు ఇచ్చారు. పార్టీ ఆఫీస్ నుంచి టీ న్యూస్ ఛానల్‌ను ఎప్పటిలోగా షిఫ్ట్ చేస్తారో వారంలోగా వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ భవన్ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డిని రెవెన్యూ అధికారులు నోటీసులో పేర్కొన్నారు. కాగా 2011 నుంచి టీ న్యూస్ ఛానల్‌ను యాజమాన్యం బీఆర్ఎస్ భవన్‌లోనే నిర్వహిస్తున్నారు.

**ఎలాంటి నోటీస్ అందలేదు: బీఆర్ఎస్ పార్టీ భవన్ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి :** బీఆర్ఎస్ పార్టీ భవన్‌కు రెవెన్యూ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. పార్టీ కార్యాలయంలో టీ న్యూస్ ఛానల్ నిర్వహించడంపట్ల అభ్యంతరం వ్యక్తం చేయడంపై ఈ మేరకు నోటీసులు ఇచ్చారు. పార్టీ ఆఫీస్ నుంచి టీ న్యూస్ ఛానల్‌ను ఎప్పటిలోగా షిఫ్ట్ చేస్తారో వారంలోగా వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ భవన్ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డిని రెవెన్యూ అధికారులు నోటీసులో పేర్కొన్నారు. అయితే ఈ నోటీసులపై బీఆర్ఎస్ పార్టీ స్పందించలేదు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ భవన్ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటివరకు తనకు ఎలాంటి నోటీస్ అందలేదని చెప్పారు. గతంలోనే ఓసారి అధికారులు నోటీస్ ఇచ్చారని, త్వరలోనే ఛానల్ ఆఫీస్ తరలింపుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు చెప్పామన్నారు. కాగా 2004లో వైఎస్ ప్రభుత్వం టిఆర్ఎస్ పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించింది. 2006 ఆగస్టు 14న పీఎంకే అధినేత రామ్ దాస్ చేతుల మీదుగా తెలంగాణ భవన్ ప్రారంభమైంది. కాగా పార్టీ కార్యాలయంలో వాణిజ్య కార్యక్రమాలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు నోటీసులు ఇచ్చారు.

## బెల్లంపల్లిలో హీటెక్కిస్తున్న క్యాంపు రాజకీయాలు..



బెల్లంపల్లి పట్టణం: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపాలిటీలో క్యాంపు రాజకీయాలు ప్రారంభమయ్యాయి. అవిశ్వాసంలో నెగ్గేందుకు భారాస, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుత ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ ఛైర్మన్ బత్తుల సుదర్శన్‌ను గద్దె దించేందుకు ఇరుపార్టీలకు చెందిన కౌన్సిలర్లు పావులు కదపడం చర్చనీయాంశంగా మారింది.

అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఐదుగురు భారాస కౌన్సిలర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇందులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత సైతం ఉన్నారు. బెల్లంపల్లిలో మొత్తం 34 వార్డులు ఉండగా.. ప్రస్తుతం కాంగ్రెస్‌కు 11 మంది కౌన్సిలర్లు మద్దతు ఇస్తున్నారు. ప్రస్తుత ఛైర్‌పర్సన్ శ్వేతతో కలిపి ఈ సంఖ్య 12కు చేరింది. భారాసకు 21 మంది కౌన్సిలర్లు ఉండగా, భాజపాకు ఒక కౌన్సిలర్ ఉన్నారు. ఈ క్రమంలో భారాస కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఈ నెల 12న అవిశ్వాసానికి సంబంధించిన సమావేశం నిర్వహించడానికి కౌన్సిలర్లకు ఇప్పటికే జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, భారాస తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. గురువారం తెల్లవారుజామున భారాసకు చెందిన కౌన్సిలర్లు బస్సులో ప్రత్యేక శిబిరానికి తరలివెళ్లారు. ఈ బస్సులో సుమారు 20 మంది భారాస కౌన్సిలర్లు శిబిరానికి వెళ్లినట్లు సమాచారం. భారాస శిబిరం నుంచి గోసిక రమేశ్ ఛైర్మన్ అభ్యర్థిగా, అఫ్సర్ వైస్ ఛైర్మన్ అభ్యర్థిగా బరిలో ఉండేందుకు నిర్ణయించారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ మద్దతు కోసం ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్‌లోని మరో వర్గం తమలోని ఇద్దరు కౌన్సిలర్లను ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ చేసేందుకు పావులు కదుపుతోంది.

## నాన్న వద్దకు వెళ్తానంటూ.. స్కూల్ బస్సు కిందపడి చిన్నారి మృతి



హబ్సిగూడ: హైదరాబాద్ హబ్సిగూడలోని రవీంద్రనగర్‌లో విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు స్కూల్ బస్సు కిందపడి రెండేళ్ల చిన్నారి మృతి చెందింది. తన తండ్రి, అమ్మమ్మతో కలిసి సోదరుడిని స్కూల్ బస్సు ఎక్కించడానికి చిన్నారి జావ్లానా రోడ్డుపైకి వచ్చింది. డ్రైవర్‌తో తండ్రి మిథున్ మాట్లాడుతుండగా అమ్మమ్మతో ఉన్న చిన్నారి.. నాన్న వద్దకు వెళ్తానంటూ పరుగులు తీసింది. ఈ క్రమంలో బస్సు డ్రైవర్ వాహనం తీయగా, ప్రమాదవశాత్తు టైర్ కిందపడి మృతి చెందింది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే తమ పాప మృతి చెందిందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఓయూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## ఓటమిపాలైనా భారాస నేతల వైఖరిలో మార్పు రాలేదు: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: ఓటమిపాలైనప్పటికీ భారాస నేతల వైఖరిలో మార్పు రాలేదని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి సీతక్కతో కలిసి ఆయన మాట్లాడారు. "మార్పు కావాలని ప్రజలు తీర్పు ఇచ్చారు. డిసెంబరు 7వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పడిన మరుసటి రోజే రెండు హామీలు అమలు చేశాం. కేసీఆర్ రెండోసారి గెలిచాక రెండు నెలల వరకు మంత్రులు కూడా లేరు. మంత్రులు లేకుండా రెండు నెలలపాటు పాలించారు. భారాస ప్రభుత్వం 3,500 రోజులు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించింది. ప్రజలను అవమానిస్తూ కేసీఆర్ పాలన సాగించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఇప్పటికే 6.50 కోట్ల జీరో టికెట్లు జారీ అయ్యాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాం.

నవ్విపోదురుగాక.. నాకేంటి అన్నట్టుగా భారాస నేతల వైఖరి ఉంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన 20 రోజులకే కేటీఆర్ అక్కసు వెళ్లగక్కుతున్నారు" అని శ్రీధర్‌బాబు విమర్శించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com